Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 306 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 నవంబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

## 'వీసా స్టాంపింగ్' పైలట్ ప్రాజెక్టు జాప్యంతో నైరాశ్యం

వాషింగ్టన్ : హెచ్, ఎల్ కేటగిరీ ఉద్యోగుల వీసాల రెన్యువల్ కోసం దేశీయంగానే(అమెరికాలోనే) స్టాంపింగ్ ప్రక్రియను అనుమతించే పైలట్ కార్యక్రమం ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతో అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న వేలాదిమంది భారతీయ నిపుణులు నిరాశ చెందుతున్నారు.

అమెరికాలో పనిచేస్తున్న భారతీయ నిపుణుల్లో వేలాదిమంది సెలవుల్లో కుటుంబంతో గడిపి రావాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. స్వదేశంలో కుటుంబసభ్యులతో గడిపిన తర్వాత తిరిగి అమెరికా రావాలంటే ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం, లేదా చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, ముంబైలలోని అమెరికా కాన్సు లేట్‌లలో పాస్‌పోర్టులపై స్టాంపింగ్ వేయించుకోవాల్సి ఉంటుంది. 2004లో దీనిని నిలిపివేశారు. దీంతో స్వదేశంలో పత్రాలపై స్టాంపింగ్ కోసం సుదీర్ఘకాలం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# కేసీఆర్ బక్కోడు కాదు..

# భూబకాసురుడు



## విజయభేరి యాత్రలో కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్ రావులు దుబ్బాక నిధులను రద్దు చేసి సిద్దిపేటకు తరలిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. బక్కోడిని అని చెప్పి కోట్ల రూపాయలు మింగాడు. కేసీఆర్ భూబకాసురుడు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. దుబ్బాకలో ఆయన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మామ కేసీఆర్, అల్లుడు హరీశ్ రావులకు ఇక్కడి నిధులను సిద్దిపేటకు తరలించడం అలవాటుగా మారిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం మనకు నిధులు ఇవ్వడం లేదని ఇక్కడి ప్రజలు ఆ తర్వాత బీజేపీ అభ్యర్థిని గెలిపించారని గుర్తు చేశారు. కేంద్రం నుంచి.. మోదీ వద్ద నుంచి నిధులు తీసుకువచ్చి దుబ్బాకను అభివృద్ధి చేస్తానని గత ఉప ఎన్నికల సమయంలో రఘునందన్ రావు చెప్పారని, మరి ప్రత్యేకంగా ఏమైనా నిధులు తెచ్చారా? చెప్పాలన్నారు. రఘునందన్ రావుకు మళ్లీ ఓటు అడిగే హక్కు లేదన్నారు.

**రేవంత్ ప్రశ్నల వర్షం..** రఘునందన్‌రావు ఎప్పుడూ పార్టీ రాజకీయ కుమ్ములాటలలో బిజీగా ఉన్నారు తప్ప దుబ్బాకకు చేసిందేమీ లేదన్నారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి పేరులోనే కొత్త కాదని, ఆయనది అంతా పాత చింతకాయ పచ్చడే అన్నారు. ఈ పాత చింతకాయపచ్చడిని రెండుసార్లు ఎంపీగా గెలిపిస్తే ఏం చేశారు? అని నిలదీశారు. ఆయన దొర కేసీఆరే ముఖ్యమంత్రిగా ఉన్నారని, గడీల వద్ద కాపలాగా ఉంటే కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాకకు నిధులు ఎందుకు తీసుకురాలేదు? రెవెన్యూ డివిజన్ ఎందుకు చేయలేదు? దుబ్బాకకు పీజీ కాలేజీ ఎందుకు తేలేదు? చేగుంటలో డిగ్రీ కాలేజీ ఎందుకు తేలేదు? పేదవారికి ఎందుకు డబుల్ బెడ్రూంలు ఇప్పించలేదు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. పదేళ్ల నుంచి ఎంపీగా ఉన్న కొత్త చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్ వద్ద బంట్రోతులా ఉన్నాడని విమర్శించారు.

**ఆయన్ను ఎందుకు మంత్రిని చేయలేదు..** దుబ్బాక నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆనాడు దుబ్బాక నిధులను కేసీఆర్ సిద్దిపేటకు తీసుకువెళ్తే ముత్యంరెడ్డి కొట్లాడి తీసుకువచ్చారన్నారు. హరీశ్ రావు కూడా మీ ప్రాంతానికి రావాల్సిన నిధులను అడ్డుకొని సిద్దిపేటకు తరలించుకుపోయారన్నారు. దుబ్బాకను కేసీఆర్ గౌరవించింది నిజమే అయితే ఉద్యమంలో మొదటి నుంచి ఉన్న రామలింగారెడ్డిని ఎందుకు మంత్రిగా చేయలేదు? అని ప్రశ్నించారు. కొత్త ప్రభాకర్ రెడ్డిని చూశారు.. రఘునందన్ రావును చూశారు.. ఇక ఆదర్శ రైతు చెరుకు ముత్యం రెడ్డి కొడుకు శ్రీనివాస్ రెడ్డిని చూడండని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇందిరమ్మ రాజ్యం తెస్తే బీఆర్ఎస్‌కు వచ్చిన నొప్పి ఏమిటి? అని ప్రశ్నించారు. డిసెంబర్ 9న ఇందిరమ్మ రాజ్యం... కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందన్నారు. కేసీఆర్ లక్ష కోట్లు మింగారని, హైదరాబాద్ నగరం చుట్టూ పదివేల ఎకరాల భూమిని ఆక్రమించాడని కేసీఆర్ పై నిప్పులు చెరిగారు. కేసీఆర్ బక్కవాడు కాదని బకాసురుడు అని ఎద్దేవా చేశారు. ఫామ్ హౌస్ లో పడుకుంటే కుంభకర్ణుడివి అన్నారు. కేసీఆర్ లేస్తే మింగుతాడు.. మింగితే పడుకుంటాడు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోడన్నారు. దుబ్బాకకు పట్టిన శని కేసీఆర్ కుటుంబం అన్నారు. ఎందుకంటే ఇక్కడకు వచ్చిన సబ్ స్టేషన్లు, నిధులు, కాలేజీలను సిద్దిపేటకు తరలిస్తున్నారని ఆరోపించారు.

**కేసీఆర్‌కు కూడా చర్లపల్లి జైలులో డబుల్‌బెడ్ రూం కట్టిస్తా..!...** దుబ్బాకకు రావలసిన నిధులు మామ అల్లుళ్లు సిద్దిపేటకు తరలించుకు పోయింద్రని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావుపై ఆరోపించారు. గురువారం దుబ్బాక నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ విజయభేరీ సభలో రేవంత్ మాట్లాడారు. మూడేండ్లలో రఘునందన్ రావు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట తప్పిన బీజేపీ ఎమ్మెల్యేకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. బీజేపీ రాజకీయ కుమ్ములాటల్లో రఘునందన్ మునిగిపోయారని అన్నారు. కేసీఆర్ కుటుంబానికే బంగారు తెలంగాణ అని, ప్రజలకు బొందల తెలంగాణగా మారిందని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేను బక్కోన్ని అని అంటున్నాడు కేసీఆర్. బక్కోనికి బుక్కెడు బువ్వ, రెండు పెగ్గుల మందు కావాలి. కానీ 10 వేల ఎకరాలు మింగినవ్. ఆ పక్క హరీశ్ రావు, మరోపక్క కేటీఆర్ ఉండి దుబ్బాకను ఎందుకు బంగారు తునక చేయలేదు" అని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 లేకే గ్యాస్ సిలిండర్, ఆడపిల్ల పెళ్లికి లక్ష రూపాయలు, తులం బంగారం, వ్యవసాయానికే కాదు గృహావసరాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా అందజేస్తామన్నారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు రాదని కేసీఆర్ చెబుతున్నారని... కేసీఆర్ మతిపోయి మాట్లాడుతుండో.. మందేసి మాట్లాడుతుందో తెలియడం లేదని విరుచుకుపడ్డారు. రైతుకే కాదు.. భూమి లేని పేదలకు కూడా రూ.12000 రైతు బంధు ఇస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యకు రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. ఈ నెల కేసీఆర్ ఉంటే 2 వేలే అని.. వచ్చేనెల కేసీఆర్ సర్కారును బొంద పెడితే రూ.4 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్‌కు కూడా చర్లపల్లి జైలులో డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తానని సెటైర్ విసిరారు. కేసీఆర్‌తో పాటు ఆయన కొడుకు, బిడ్డ ఉండడానికి ఖచ్చితంగా ఇలు కట్టిస్తానన్నారు. కేసీఆర్ దోచుకున్న లక్ష కోట్లు కక్కిస్తానని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# మబ్బుల్లో పరిగెత్తే పిడుగులు తెలంగాణ యువత

భద్రాద్రి కొత్తగూడెం: తాను తెలంగాణలో తిరగక పోయినా జనసేన ఉందంటే అది మీ అభిమానమేనని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గురువారం కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం గ్రౌండ్స్‌లో బిజేపీ-జనసేన ఉమ్మడి ఎన్నికల ప్రచార సభలో పవన్ మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం దోపిడీ వల్లే తెలంగాణ పోరాటానికి పునాది పడిందని వ్యాఖ్యానించారు.

కౌలు రైతులను రైతులు కాదనడం బాగో లేదన్నారు. ధరణిలో లోపాలున్నాయని విమర్శించారు. అభివృద్ధి ఆంధ్రాలో జరగకపోతే తెలంగాణ యువత నష్ట పోతుందన్నారు. మబ్బుల్లో పరిగెత్తే పిడుగులు తెలంగాణ యువత అని, పారిపోరుకుండా జెండా పట్టుకుని నిలబడతారని పవన్ అన్నారు. "శివ అనే 16 ఏళ్ల చెంచు కుర్రాడు యురేనియం తవ్వకాలపై నన్ను కలిశాడు. తెలంగాణ యువత నిప్పు కణిక అనడానికి శివ నిదర్శనం. నా తెలంగాణ కోటి రతణాల వీణ అన్న.. దాశరథీ కృష్ణమాచార్యులు నాకు స్ఫూర్తి. సనాతన ధర్మం..




సోషలిజం రెండూ నడప గలిగేది జనసేన. బీఆర్ఎస్‌ని ఒక్కమాట అనక పోవడానికి కారణం నేను ఇక్కడ తిరగక పోవడం. దశాబ్దం వేచి చూశా. ఆంధ్రాలో అరాచకంపై పోరాటానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నాకు స్ఫూర్తి. తెలంగాణలో అణగారిన వర్గాలకు జనసేన అండగా ఉంటుంది. మోదీ నాయకత్వ పటిమ నచ్చి ఆయనకు మద్దతుగా ఉన్నా. ఎవ్వరు వచ్చినా రాక పోయినా దక్షిణాది నుంచి మోదీకి మద్దతుగా ఉంటానని గుజరాత్ వెళ్లి కలిశా. భవిష్యత్తు యువత అని చెప్పిన గద్దర్‌కు జోహార్లు. నిధులు, నీళ్ళు, నియామకాలు నినాదంతో వచ్చిన తెలంగాణ అనుకున్న స్థాయిలో లేదు. తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి చేయగలిగేది మోదీ మాత్రమే. రెండు తెలుగు రాష్ట్రాల్లో నిత్యం ఎన్నికల వాతావరణం అవాంఛనీయం. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి. సింగరేణిలో ఉద్యోగాలు రావాలన్నా పేపర్ లీక్స్ లేకుండా ఉండాలంటే బీజేపీ రావాలి" అని పవన్ పేర్కొన్నారు. భవిష్యత్తు యువత అని చెప్పిన గద్దర్‌కు జోహార్లని పవన్ అన్నారు. నిధులు నీళ్ళు నియామకాలు నినాదంతో వచ్చిన తెలంగాణలో అనుకున్న స్థాయిలో లేదని విమర్శించారు.

తెలంగాణలో బీసీ నేతను ముఖ్యమంత్రి చేయగలిగేది మోదీ మాత్రమేనని, రెండు తెలుగు రాష్ట్రాల్లో నిత్యం ఎన్నికల వాతావరణం అవాంఛనీయమని అన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ఆయన ఆకాంక్షించారు. సింగరేణిలో ఉద్యోగాలు రావాలన్నా పేపర్ లీక్స్ లేకుండా ఉండాలంటే బిజెపి రావాలన్నారు.



## తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

రంగారెడ్డి జిల్లా: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు. మహేశ్వర నియోజకవర్గం, తుప్పుగూడలో జరిగిన పార్టీ బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్షాల భూటకపు మాటలను తిప్పి కొట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు భట్టి విక్రమార్క పిలుపిచ్చారు. తెలంగాణ ఆర్థిక పరంగా బలమైన రాష్ట్రం అయినందున సుభిక్షమైన పాలన అందించాలన్నది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తర్వాత పార్టీ అభ్యర్థి కేఎల్ఆర్ మాట్లాడతూ మహేశ్వరంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. కేఎల్ఆర్‌ను ఎమ్మెల్యేగా గెలుపించుకుంటే అందరికీ మేలు జరుగుతుందని పలువురు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

# రంగంలోకి పీకే

## బీయూరెస్ కి బిగ్ షాక్ ఇచ్చిన సర్వే...




# లాస్ట్ మినిట్‌లో పీకే ఎంట్రీ !

హైదరాబాద్ : అధికార బీయారెస్ కి బిగ్ షాక్ గా ఇంటెలిజెన్స్ రిపోర్ట్ ఉందని ప్రచారం సాగుతోంది. కేవలం రెండు రోజుల వ్యవధిలో తెలంగాణాలో మొత్తం సీన్ మారిపోయింది అని అంటున్నారు. ఈ సారి సీట్లు తగ్గుతాయని బీయారెస్ లోనూ అంతర్మధనంగా చర్చ ఉంది. అయితే సింపుల్ మెజారిటీ అయినా వస్తుందని ఊహించిన అధినాయకత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక మాత్రం షాకింగ్ న్యూస్ గా మారింది అని అంటున్నారు. ఇంతకీ ఇంటెలిజెన్స్ సర్వే నివేదికలో ఏముంది అంటే చాలా చిత్ర విచిత్రాలు ఉన్నాయని అంటున్నారు. గ్రౌండ్ లెవెల్ రియాల్టీస్ మాత్రం వేరుగా ఉన్నాయని అంటున్నారు. ఊహించని విధంగా వ్యతిరేకత బాగా ఉందని అంటున్నారు. ఇదిలా ఉంటే ప్రముఖ సంస్థలు ఇప్పటిదాకా చేసిన సర్వేలు అన్నీ కూడా కాంగ్రెస్ కే మెజారిటీ సీట్లు వస్తాయని తేల్చి చెప్పాయి. అయితే బీయారెస్ అధినాయకత్వం అతి విశ్వాసమో లేక ఆత్మ విశ్వాసమో తెలియదు కానీ వాటిని అంతగా పట్టించుకోలేదు అని అంటున్నారు. అయితే రోజు రోజుకూ మారుతున్న పరిణామాలతో బీయారెస్ నేరుగా ఈసారి ఇంటెలిజెన్స్ సర్వేని చేయించింది అని అంటున్నారు. సరిగ్గా ఇక్కడే షాకింగ్ నిజాలు బీయారెస్ నేతలను నిద్ర పట్టకుండా చేశాయని అంటున్నారు. ఉన్నది ఉన్నట్లుగా కుండబద్ధలు కొట్టినట్లుగా ఇంటెలిజెన్స్ సర్వే అనీ బయటపెట్టింది అని అంటున్నారు. ఇంటెలిజెన్స్ సర్వే ప్రకారం చూస్తే కాంగ్రెస్ భారీ విజయం వైపుగా దూసుకుని వెళ్తోంది అని తేలింది అంటున్నారు. దీంతో ఏమి చేయాలి అన్నది బీయారెస్ అగ్ర నాయకత్వానికి అర్ధం కాకుండా ఉందని అంటున్నారు. ఉన్నది అతి కొద్ది సమయం కాబట్టి జనాల అభిప్రాయాలను తమ వైపునకు ఎలా తిప్పుకోవాలీ అన్నది బీయారెస్ కి బిగ్ టాస్క్ గా మారింది అని అంటున్నారు. దాంతో బీయారెస్ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ని హుటాహుటిన పిలిపించాలని నిర్ణయించిందని అంటున్నారు. అదే విధంగా ఐప్యాక్ టీం ని కూడా వెనువెంటనే సంప్రదించడం కూడా చకచకా జరిగిపోయాయని అంటున్నారు. ఇదిలా ఉండగా గులాబీ పెద్దల ఆదేశానుసారం తాజాగా ప్రశాంత్ కిశోర్ హైదరాబాద్ రావడం జరిగింది అని అంటున్నారు. ఇక ఆయనతో మూడు గంటల పాటు బీయారెస్ అధినాయకత్వం ఏకాంత చర్చలు జరిపింది అని అంటున్నారు. ఈ కొద్ది రోజులూ చాలా ముఖ్యం, మీ సేవలు అందించడం, ముందు పార్టీని గెలిపించండి. ఆ తరువాత ఏమున్నా మాట్లాడుకుందామని స్వయంగా కేసీయార్ పీకేతో అన్నట్లుగా కూడా ప్రచారం సాగుతోంది. ఆ తరువాత కేటీయార్ హరీష్ రావు, కవిత కూడా ప్రత్యేకంగా భేటీ అయి అనేక విషయాలు చర్చించారు అని అంటున్నారు. ఇక నేరుగా కేసీయార్ నుంచే గెలిపించండి అంటూ భారీ ఆఫర్ రావడంతో పీకే కాదనలేకపోయారు అని అంటున్నారు. మొత్తానికి చూస్తే పీకే లాస్ట్ మినిట్ లో రంగంలోకి దిగారని అంటున్నారు. ఇదిలా ఉండగా మొదట్లో పీకే సేవలను వాడుకోవాలని చూసిన బీయారెస్ అధినాయకత్వం ఆ తరువాత ఎందుకో వెనక్కి తగ్గింది. దాంతోనే పీకే కూడా డ్రాప్ అయ్యారని టాక్ నడచింది. ఇపుడు లెవెంత్ అవర్ లో పీకే బీయారెస్ అధినాయకత్వానికి గుర్తు రావడం నిజంగా ఆలోచించాల్సిన విషయమే. ఇక పీకే చూస్తే ఆయనది లక్కీ హ్యాండ్ అని చెబుతారు. ఆయన టేకప్ చేసిన పార్టీలు అన్నీ అధికారాన్ని అందుకున్నాయి. ఇదిలా ఉంటే బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో పీకే వ్యూహకర్తగా పనిచేయబోతున్నారు. ఇక తెలంగాణా కాంగ్రెస్ కి పీకే శిష్యుడు సునీల్ కనుగోలు వ్యూహకర్తగా ఉన్నారు. ఇపుడు లాస్ట్ మినిట్ లో గురువు పీకే బీయారెస్ వైపు వచ్చారు. దాంతో పీకే ఏమి మ్యాజిక్ చేస్తారు అన్నది చర్చగా ఉంది. బీయారెస్ లో సడెన్ గా చోటు చేసుకున్న ఈ పరిణామాలు చూసిన రాజకీయాలు అంటే అభిమానం ఆసక్తి ఉన్న గురురాజు అంజన్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో ట్విట్టర్ ద్వారా ఈ విషయం రాసుకొచ్చారు. నాడు పీకే వద్దు నేడు మాత్రం ముద్దు అని ఆయన ట్విట్టర్ లో పెట్టిన ఈ మెసేజ్ ఇపుడు వైరల్ గా మారింది. అయితే దీన్ని బీయారెస్ నేతలు ఖండించకపోవడం చిత్రం. ఇదిలా ఉంటే కారు పార్టీని జోరు చేసే బాధ్యత పీకే తీసుకుని గెలుపు దారి చూపిస్తారా లేదా అన్నది కొద్ది రోజులలో తేలనుంది అని అంటున్నారు. పీకే కనుక రంగంలో ఉంటే విజయం అన్న మాట నిజం అవుతుందా లేక సర్వేలు చెప్పినట్లుగా కాంగ్రెస్ గెలుస్తుందా అన్నది చూడాలని అంటున్నారు.

# సంపాదకీయం

## తెలంగాణ ఎన్నికల్లో 'సీతమ్మ' పలుకులు..!!

చేయాల్సింది చేసేసి.. ఇప్పుడు నీతులు చెబితే ఎవరైనా ఏమంటారు? నవ్విపోతారు! అచ్చంగా ఇప్పుడు బీజేపీ సీనియర్ నాయకురాలు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగాలు.. పలుకులు కూడా అలానే ఉన్నాయని అంటున్నారు ఆర్థిక నిపుణులు. తాజాగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో పర్యటించిన నిర్మలా సీతారామన్.. కేసీఆర్ సర్కారుపై విమర్శలు గుప్పించారు. సరే.. రాజకీయంగా విమర్శలు కామనే కదా! అనుకోవచ్చు. కానీ, ఇక్కడే సీతమ్మ లోతుల్లోకి వెళ్లిపోయారు. దీంతో ఆమె చేసిన విమర్శలు.. ఆమెకే తగులుతున్నాయి. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రం అప్పుల గురించి నిర్మలమ్మ ప్రస్తావించారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులు పాటు చేసేశారని అన్నారు. అంతేకాదు.. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పులు చేసేసిన కేసీఆర్‌ను ఇంటికి పంపేయాలని పిలుపునిచ్చారు. అయితే.. వాస్తవం ఏంటంటే.. కేంద్రమే రాష్ట్రాలను అప్పులు చేసుకోవాలని ప్రోత్సహించింది. తాను ఇవ్వాల్సిన గ్రాంట్స్‌కు కోత పెట్టి.. చెత్తపై పన్నేస్తే.. ఇంత అప్పులు తెచ్చుకునే వెసులుబాటు కల్పిస్తాం.. రైతులు వాడే కరెంటు మీటర్లు పెడితే.. మరింత అప్పులు చేసుకునే అవకాశం కల్పిస్తామని ఆఫర్లు ఇచ్చింది. అంతేకాదు.. జీఎస్టీ వసూళ్లలోనూ రాష్ట్రాలకు అన్యాయం చేసింది కేంద్రమే. ఈ నేపథ్యంలోనే అనేక సందర్భాల్లో కేసీఆర్.. ఈ విషయాలను ఏకరువు పెడుతూనే ఉన్నారు. కేంద్రం చేస్తున్న చర్యల కారణంగా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కూడా ఆయన చెబుతూ వచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేయటంలో కేసీఆర్ సర్కార్ విఫలమైంది. కేసీఆర్ సర్కార్ అవినీతిపై విచారణ జరిపిస్తాం" అని కూడా సీతమ్మ సెలవిచ్చారు. అయితే.. వాస్తవానికి కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని.. దీనిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి.. ఆదుకోవాలని సీఎం కేసీఆర్ అనేక పర్యాయాలు ఢిల్లీ పర్యటనలు చేసి మొత్తుకున్నారు. అనేక మందితో కబురు కూడా పెట్టారు. కానీ, కేంద్రం చెవికెక్కించుకోలేదు. దీంతో కేసీఆర్ సర్కారే దీనిని పూర్తి చేసింది. కానీ, ఇప్పుడు మాత్రం ఎన్నికల సమయానికి దీనిలో వంకలు వెతికే పనిని పెట్టుకోవడం కేంద్రం వంతైంది. ఇక, అవినీతిపై విచారణ జరిపిస్తామన్న మాట కూడా తెలంగాణ సమాజానికి ఎక్కే పరిస్థితి లేదు. ఎందుకంటే.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అవినీతి ఎక్కువగా ఉందని అనేక ఆరోపణలు వస్తున్నాయి. ముందు వాటిని తేల్చాలనే డిమాండ్లు తరచుగా వినిపిస్తున్నాయి. "నీళ్లు, నిధులు, నియామకాల.. తెలంగాణ ఆకాంక్ష నెరవేరలేదు"- అని సీతమ్మ చెప్పుకొచ్చారు. మరి ఇన్నాళ్ల బట్టి గత పదేళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఏం చేసింది? నీటి వివాదాలు తీర్చలేక పోయింది. నిధులు ఇచ్చేందు కు.. ఆదుకునేందుకు మొహం చాటేసింది. ఇక, నియామకాల విషయానికి వస్తే.. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలనే ప్రైవేటు పరంచేస్తామంటూ.. లీకులు ఇస్తూ.. తెలంగాణ సమాజంలో అశాంతిని, గందరగోళాన్ని సృష్టించింది కేంద్రం కాదా? అనే ప్రశ్నకు నిర్మలమ్మ సమాధానం చెప్పాలని పరిశీలకులు అంటున్నారు.

# ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు

## మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్






జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లపై ఎన్నికల రాష్ట్ర పోలీస్ ప్రత్యేక పరిశీలకులు దీపక్ మిశ్రా పరిశీలకులతో సమీక్ష జరిపారు. ఎన్నికల ఏర్పాట్ల పర్యవేక్షణకై గురువారం సాయంత్రం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)కు చేరుకోగా, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్, వారికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపిఎస్, తో పాటు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు ఎన్నికల సాధారణ అబ్జర్వర్ ఎస్.కె.జైన్, పూర్వాగార్గ్,అమన్ మిట్టల్, పోలీస్ అబ్జర్వర్ నేహా యాదవ్ లతో భేటీ అయ్యిన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఐదు నియోజకవర్గాల లో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ గౌతమ్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్ర పరిశీలకులకు వివరించారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాలలో 126 మంది అభ్యర్థులు ఎన్నికలలో పోటీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో 2439 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయదమైంది.. జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు మహిళా పోలింగ్ స్టేషన్ల చొప్పున ఐదు నియోజకవర్గాలలో 25 మహిళా పోలింగ్ స్టేషన్లు , నియోజకవర్గానికి 5 చొప్పున 25 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు, ఓటర్ స్లీప్ లను పంపిణి చేస్తున్నామని అన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 315 పరిష్కారించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 80 సంవత్సరాలకు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, నలభై శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యంగ ఓటర్లు ఇంటి నుండి ఓటు వేసేందుకు వీలుగా దరఖాస్తులు చేసుకున్నారని, ఈ మేరకు వారి ఇళ్ల వద్దకే బృందాలను పంపించి ఓటింగ్ జరిపేలా పకడ్బందీ చర్యలు సుకుంటున్నామని అన్నారు. బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని, తదనుగుణంగా ర్యాండమైజెషన్ ప్రక్రియ పూర్తి చేసి అదనపు బ్యాలెట్ యూనిట్లను కేటాయించామని అన్నారు. ఇప్పటికే అన్ని సెగ్మెంట్లకు ఈవీఎం లు, పోలింగ్ సిబ్బంది కేటాయింపులకు సంబంధించిన ర్యాండమైజెషన్ సైతం పూర్తయ్యిందని తెలిపారు. 80 సంవత్సరాలకు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు నలభై శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యంగ ఓటర్లు 1070 మంది ఇంటి నుండి ఓటు వేసేందుకు వీలుగా దరఖాస్తులు చేసుకున్నారని, ఈ మేరకు వారి ఇళ్ల వద్దకే బృందాలను పంపించి ఓటింగ్ జరిపేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఫారం-12 అందించారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ రాష్ట్ర పరిశీలకుల దృష్టికి తెచ్చారు.

ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర పోలీస్ ప్రత్యేక పరిశీలకులు దీపక్ మిశ్రా తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర పరిశీలకులు ఆరా తీశారు. ఎన్నికల నిర్వహణ తీరుతెన్నుల గురించి జిల్లాకు కేటాయించబడిన సాధారణ పరిశీలకులను ఆరా తీయగా, ఇప్పటి వరకు ఐదు నియోజకవర్గాల పరిధిలోనూ పరిస్థితులన్నీ సజావుగానే ఉన్నాయని వారు రాష్ట్ర పరిశీలకులకు తెలియజేశారు. కాగా, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని స్టేట్ అబ్జర్వర్ లు పోలీస్ కమిషనర్ కు సూచించారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎలక్షన్ కమిషన్ పాసులు కలిగి ఉన్న వారిని మినహాయించి, ఇతరులు ఎవరినీ లోనికి అనుమతించకూడదని, ఈ విషయమై క్షేత్ర స్థాయిలో బందోబస్తు విధులు నిర్వర్తించే సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదని, పోలింగ్ స్టేషన్ల సమీపంలో ఓటర్లను అభ్యర్థులు, వారి ఏజెంట్లు కలిసి వారికే ఓటు వేసేలా ఒత్తిడి చేయకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలన్నారు. అలాగని నిబంధనల ఉల్లఘనకు పాల్పడే వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులను ఆదేశించారు. ఓటింగ్ సందర్భంగా ఏవైనా పోలింగ్ కేంద్రాల వద్ద అనుకోని రీతిలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నట్లైతే, సమాచారం అందిన వెంటనే హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధులు మోసుకొచ్చిన వర్షం



ఆదిలాబాద్ : భారీ వర్షాలతో స్తంభించిన జనజీవనం పూర్తి స్థాయిలో తేరుకోకముందే వ్యాధుల వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. ఐటీడీఏ పరిధిలోని ఉట్నూరు, ఇంద్రవెల్లి, సిరికొండ, నార్నూరు, గాదిగూడ, జైనూరు, సిర్పూరు(యు), లింగాపూర్ ఏజెన్సీ మండలాలలో కురిసిన భారీ వర్షాలతో పారిశుద్ధ్యం లోపించింది. దోమలు, క్రిమికీటకాల వ్యాప్తి గణనీయంగా పెరిగిపోయి అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. నీరు కలుషితమై అతిసారం విజృంభిస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలు వాంతులు, విరేజనాలు, విషజ్వరాలతో అస్వస్థతకు గురవుతున్నారు.ఇంటింటా వ్యాధిగ్రస్థులే..ఏజెన్సీలో ఇంటింటా విషజ్వరాలు, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. మారుమూల గ్రామాల ప్రజలు తొలుత తమ సమీపంలోని పీహెచ్‌సీలకు వెళ్తున్నారు. అక్కడ నయం కాకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చూయించుకొని జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. తగ్గకపోవడంతో ఉట్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చేరుతున్నారు.

అధికారులు స్పందించాలి..ఏజెన్సీలో వ్యాధుల వ్యాప్తిపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించకుండా వెంటనే అవగాహన కార్యక్రమాలతో ప్రజలను చైతన్యం చేయాలి. పారిశుద్ధ్యలోపం, కలుషినీటి సమస్యలను పరిష్కరించాలి. వ్యాధిగ్రస్థులకు తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఒకే పడకపై చికిత్స పొందుతున్న ఈ చిన్నారుల పేర్లు శివాణి(06), తనుశ్రీ(03). వీరు నార్నూరు మండలం నాగల్‌కొండకు చెందిన సుభాష్, సరిత దంపతుల పిల్లలు. నాలుగు రోజుల నుంచి వీరిద్దరు తీవ్రజ్వరం, విరేచనాలతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు వీరిని అక్కడి పీహెచ్‌సీతో పాటు ప్రైవేటు ఆసుపత్రికి తీసికెళ్లినా తగ్గకపోవడంతో ఉట్నూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి చేర్పించారు.అతిసారంతో బాధపడుతూ.. ఉట్నూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ బాబు ప్రణీత్. ఉట్నూరులోని బాయవాడకు చెందిన లత, దిలీప్‌ల కుమారుడు.

రెండు రోజుల నుంచి వాంతులతో అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇలా ఏజెన్సీ వ్యాప్తంగా అతిసారం, అంటు వ్యాధులు గ్రామీణులను ఇబ్బంది కలిగిస్తున్నాయి.కలుషిత నీరు..భారీ వర్షాలు, వరదలతో మిషన్ భగీరథ పైపు లైనింగ్ తెగిపోయి ఏజెన్సీ ప్రాంతంలో రక్షిత నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో బావులు, చేతిపంపులలోని క్లోరినేషన్ చేయని కలుషితమైన నీటిని తాగి గ్రామీణ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మరోవైపు గ్రామాలలో చేతిపంపులు, రక్షిత నీటి పథకాల వద్ద పారిశుద్ధ్యం లోపించి వ్యాధులకు దారితీస్తోంది.

# ఓటరు ఓసారి ఆలోచించు....

ఢిల్లీ, కర్ణాటక పెద్దలు చెబితే మనం వినే ప్రభుత్వం రావాలా, లేదా మనం చెబితే ఢిల్లీ పెద్దలు వినే ప్రభుత్వం రావాలా... ప్రధానమంత్రిని ఎన్నుకునే ఎన్నికల్లో ఎవరికైనా ఓటు వేయొచ్చేమో కానీ, స్థానిక ముఖ్యమంత్రి ఎన్నికల్లో మాత్రం చెన్నైలోల మన స్థానిక ప్రభుత్వం ఉండాలి మనం అభివృద్ధి చెందాలంటే.... మన రాష్ట్రాన్ని 11 సార్లు పాలించిన ప్రభుత్వం ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు మినహా మరో అంత పెద్ద ఆసుపత్రి కట్టలేదు కదా, కనీసం కట్టాలని ఆలోచన కూడా రాలేదు. అదే ప్రస్తుతం పాలిస్తున్న ప్రభుత్వం నగరానికి నాలుగు వైపులా అతిపెద్ద ఆస్పత్రులను నిర్మిస్తోంది, మరీ ముఖ్యంగా ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసింది. వైద్య కళాశాల అంటే కేవలం కళాశాలలే కాదు దాంతో పాటుగా అందులో ప్రభుత్వ పెద్ద ఆసుపత్రి సైతం కొనసాగుతోంది, తద్వారా మూడు సంవత్సరాల తర్వాత ప్రతి సంవత్సరం మన రాష్ట్రం నుండి ఎంతోమంది వైద్యులుగా విద్యావంతులైన పట్టా పుచ్చుకుంటారు. తద్వారా వైద్యుల కొరత తగ్గుతుంది. ప్రజలకు వైద్య భారము తగ్గుతుంది. ముఖ్యంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందబోతోంది. అంతేకాకుండా ముఖ్యంగా ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులోకి వచ్చింది. కోసం మెరుపు ఏమిటంటే పదేళ్లపాటు సుస్థిరంగా పాలించిన ప్రభుత్వాన్ని వదిలి ముఖ్యమంత్రి పదవి కొరకు వాళ్ళలో వాళ్లకే కుమ్ములాటలు దానికి మళ్లీ కేంద్రం జోక్యం, అంతేకాకుండా మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి కాదు ఉపముఖ్యమంత్రి కాదు కనీసం ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి కాదు కదా చివరకు ఓ మంత్రిగా ఏదో ఒక శాఖల ఐదేళ్లు కాదు కదా కనీసం సంవత్సరం కూడా అనుభవం లేని వ్యక్తి ముఖ్యమంత్రిగా తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తానని ప్రజల్ని నమ్మిస్తున్నాడు, పైపెచ్చు మాటలు కోటలు దుంకుతాయి కాళ్లు తంగళ్లు దుంకయన్న అన్న వాస్తవాన్ని మర్చిపోదామా ఒసారి ఆలోచించండి.

# నిపుణుల మాట.. కొలువుకు బాట

ఆదిలాబాద్ :రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగాల కోసం అభ్యర్థులు పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెలలో పోలీసు ప్రాథమిక పరీక్ష నేపథ్యంలో అభ్యర్థులు ఆందోళన వీడి.. ప్రశాంతంగా పరీక్ష రాయాలని నిపుణులు సూచిస్తున్నారు. బీసీ స్టడీ సర్కిల్లో ప్రస్తుతం కొనసాగుతున్న గ్రూప్-1, కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల శిక్షణలో అభ్యర్థులను కొలువు సాధించే దిశగా తయారు చేస్తున్నారు. ప్రస్తుతం శిక్షణలో ఉన్న 400 మందికి మరో పది రోజుల్లో శిక్షణ తరగతులు ముగుస్తాయి. వచ్చే నెలలో గ్రూప్ 2, 3, 4, టీఆర్టీ, టీచర్, గురుకులం టీచర్ ఉద్యోగాలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి. దాదాపు 600 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. బీసీ స్టడీ సర్కిల్లో పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా 20 సూత్రాలతో కూడిన సూచికను సైతం ఏర్పాటు చేశారు. పరీక్ష సమయం దగ్గర పడుతుండటంతో ఏ అంశాలపై శ్రద్ధ వహించి ఎలా సన్నద్ధం అవ్వాలనే అంశంపై నిపుణుల మాటల్లోనే..

**అవగాహన చేసుకోవాలి- దేవేందర్‌రావు, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు ప్రభుత్వ మహిళా కళాశాల ఆదిలాబాద్**

మొదట ప్రతి విషయంపై అవగాహన చేసుకోవాలి. ప్రామాణిక పాఠ్య పుస్తకాలు చదవాలి. చదివేటప్పుడు ముఖ్య అంశాలను గుర్తుంచుకోవాలి. పరీక్ష సమయం కంటే వారం ముందు ముఖ్యంశాలు, అంతర్గత అంశాలను పాయింట్ల రూపంలో సంక్లిప్తంగా రాసుకోవాలి. అదే విధంగా పఠనం చేయాలి. కచ్చితంగా అన్వయింపు అభ్యాసం, పాత పరీక్ష ప్రశ్న పత్రాలను పరిష్కరించడం అభ్యాసం చేయాలి. పాత పరీక్ష పేపర్లను చదవకపోతే అభ్యర్థుల్లో భయం ఉంటుంది. ప్రతిరోజు ఉదయం 15 నిమిషాల పాటు శాస్త్రీయ సంగీతం వినాలి. దీనివల్ల భయం పోతుంది. మనసుకు ఊరట లభిస్తుంది.

**పునశ్చరణ ముఖ్యం- డి.లక్ష్మీనరసింహం, ప్రధాన ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్**

అభ్యర్థులు తయారు చేసుకున్న నోట్స్ పునశ్చరణ చేయాలి. వీలైనన్ని నమూనా పరీక్షలు రాసి ఏ విభాగంలో మార్కులు తగ్గుతున్నాయో గమనించి ఆ విభాగాన్ని మళ్లీ చదవాలి. తెలంగాణ ఉద్యమం, సంస్కృతి, చరిత్ర, తెలంగాణ ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. గత తొమ్మిది నెలల వర్తమాన అంశాలను అధ్యయనం చేయాలి. ఇక చివరగా అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షకు హాజరుకావాలి. చదివింది గుర్తుండాలంటే సిలబస్‌లోని విభాగాల నుంచి ముఖ్యంశాలు రాసుకొని వాటిని పదేపదే చదవడం ద్వారా గుర్తుంచుకోవచ్చు భౌగోలిక శాస్త్రం లాంటి అంశాలను అధ్యయనం చేసేటప్పుడు అట్లాస్‌ను దగ్గర ఉంచుకొని చదవడం ద్వారా సులభంగా గుర్తుంచుకోవచ్చు.

**దినపత్రికలను చదవాలి- రోషిరెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు**

అభ్యర్థులు సంబంధిత సిలబస్‌పై పూర్తి పట్టు సాధించి ఆ అంశాలపై సొంత నోట్స్ తయారు చేసుకోవాలి. ప్రతి నిత్యం దినపత్రికలను చదవాలి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ, అంశాలతో పాటుగా రాజకీయ, ఆర్థిక పరమైన ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉన్న వివిధ వనరులపై పూర్తి పట్టు సాధించాలి. ఈ మధ్య కాలంలో జరిగే పరిణామాలు వాటిపై వచ్చిన వ్యాసాలను పూర్తి స్థాయిలో చదవాలి. ప్రశ్న పత్రంలో ఒక అభ్యర్థిగా భాషపై పట్టు సాధించాలంటే ప్రచురణ భాష తెలిసి ఉండాలి. అలాంటప్పుడే వ్యాస ప్రశ్నలకు జవాబులు దిద్దేవారిని ఆకట్టుకుంటాయి. మంచి మార్కులు సాధించవచ్చు అభ్యర్థులు మానసిక ప్రశాంతత కోసం రోజూ యోగా, వ్యాయామం సాధన చేస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందొచ్చు.

**నమూనా పరీక్షలతో ఉపయుక్తం- ప్రవీణ్‌కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్, ఆదిలాబాద్**

అభ్యర్థులు చదివే సిలబస్ ఏరోజు పూర్తి అవుతుందో అదేరోజు నమూనా పరీక్ష రాయాలి. దీని వల్ల అభ్యర్థి సమర్థత తెలిసి భయంపోతుంది. పరీక్ష సమయం కంటే పదిరోజుల ముందునుంచి రోజూ రెండు నమూనా పరీక్షలు పూర్తి సిలబస్‌పైన రాయాలి. గతంలో జరిగిన కానిస్టేబుల్, ఎస్ఐ పరీక్ష పేపర్‌లను మళ్లీ రాయాలి. ప్రతిరోజు వార్త పత్రికలో వచ్చే అంశాలను నోట్ చేసుకోవాలి. కఠినమైన విషయాలను అభ్యర్థులు ఉమ్మడిగా కలిసి చదవాలి. స్టడీ సర్కిల్లో పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి 20 సూత్రాలతో కూడిన ప్రత్యేక సూచికను తెలుగు, ఆంగ్ల భాషలో ఏర్పాటు చేశాం. కానిస్టేబుల్, ఎస్ఐ శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులు ప్రధానంగా అర్థమెటిక్, రీజనింగ్ ప్రశ్నలను గుర్తుంచుకోవడానికి సులభమైన మార్గాన్ని ఎంచుకోవాలి.

**పాత ప్రశ్నపత్రాలు చూసుకోవాలి- ఎస్.విజయబాబు, విశ్రాంత అధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ, పీజీ, కళాశాల ఆదిలాబాద్**

పాత ప్రశ్నపత్రాలను చూసుకోవాలి. ముఖ్యమైన అంశాలను ఎన్నుకొని వాటిని చదవాలి. అన్ని విషయాలను సమయపాలన ప్రకారంగా చదవాలి. సాయంత్రం ఒకగంట విశ్రాంతి తీసుకోవాలి. ధ్యానం, పాటలు వినడం, యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది. పరీక్ష కేంద్రానికి వెళ్లేటప్పుడు ఎలాంటి భయాందోళన ఉండకూడదు. భయం వల్ల నష్టం జరగవచ్చు పరీక్ష రాసే సమయంలో నిశ్చింతంగా రాయాలి.

# ఇబ్బందులపైనే ఉద్యోగుల్లో చర్చ

నిజామాబాద్: శాసనసభ ఎన్నికలకు గడువు దగ్గరపడుతోంది. 30వ తేదీన పోలింగ్ జరగనుంది. ఇందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఈ క్రమంలోనే పోలింగ్ విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులపైనే ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. ఒకరోజు ముందుగా అంటే 29న పోలింగ్ సామగ్రితో కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలి. రాత్రి వేళ అక్కడే బస చేసి పోలింగ్ ముగిశాక మరుసటి రోజు రాత్రికి ఇళ్లకు చేరుకోవడం తెలిసిందే. అయితే బస చేసిన చోట కనీస సౌకర్యాలు ఉండేలా కార్యాచణ అవసరం. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు ప్రణాళికలతో అసౌకర్యాలకు తావు లేకుండా చూడాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో..

పోలింగ్ విధుల్లో ఒక్కో కేంద్రంలో పీవో, ఏపీవో, ఇద్దరు ఓపీవోలు నలుగురు పనిచేస్తారు. 20 శాతం అదనపు సిబ్బందిని కలుపుకొని ఉమ్మడి జిల్లాలో 2380 కేంద్రాల్లో కలిపి 11,051 మంది విధుల్లో పాల్గొంటారు. కలెక్టర్ కార్యాలయాల్లోని నేషనల్ ఇన్ఫర్మేషన్ కేంద్రంలో నిర్దేశిత సాఫ్ట్‌వేర్ ద్వారా ఎన్నికల పరిశీలకుడి సమక్షంలో ర్యాండమైజేషన్ ద్వారా విధులు నిర్ణయిస్తారు. వీరికి 29వ తేదీ ఉదయం నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈవీఎంలు, వీవీప్యాట్ తదితర సామగ్రి అప్పగించి విధులకు పంపుతారు. వీటిని మరుసటి రోజు పోలింగ్ ముగిశాక తిరిగి అదే కేంద్రాల్లో అప్పగించి ఇళ్లకు వెళ్లాలి.



రాత్రి వేళ తిరుగు ప్రయాణం..

పోలింగ్ ముగిసే సమయం సాయంత్రం 5 గంటలకే అయినా.. ఆ సమయానికి కేంద్రం లోపల ఉన్నవారిని ఓటేసేందుకు అనుమతిస్తారు. 6 నుంచి 6:30 వరకు కొనసాగే ప్రదేశాలుంటాయి. చలికాలం త్వరగా చీకటి పడుతుంది. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను జాగ్రత్తగా సర్దుకొని అక్కడి నుంచి రిటర్నింగ్ అధికారి ఉండే నియోజకవర్గ కేంద్రానికి చేరుకోవాలి. నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి బాల్కొండ నియోజకవర్గం మానాల పోలింగ్ కేంద్రానికి 95 కి.మీ.. సాధారణంగా నియోజకవర్గ కేంద్రాలకు చేరుకోవడానికి రాత్రి 8- 9 గంటలవుతుందని చెబుతున్నారు. అక్కడి నుంచి వారి ఊళ్లు, జిల్లా కేంద్రాలకు చేరాలంటే రాత్రయ్యే అవకాశం ఉంటుంది. 29 రాత్రి నుంచి 30వ తేదీ రాత్రి వరకు వీరి భోజన సౌకర్యాలు కల్పించేందుకు ఇన్‌ఛార్జిలు, సెక్టార్ అధికారులు ఉంటారని చెబుతున్నారు. గత ఎన్నికల సందర్భంలో తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇన్‌ఛార్జులు సరిగా స్పందించలేదని పేర్కొంటున్నారు.

గైర్హాజరు కుదరదు..ఎన్నికల సంఘం ఆదేశాలను ఉద్యోగులు క్రమశిక్షణతో పాటించి తీరాల్సిందే. పోలింగ్ విధుల్లో ఎదురయ్యే అసౌకర్యాల రీత్యా కొందరు దూరంగా ఉండాలని భావించారు. ఇందుకు గట్టి పైరవీలే చేశారు. కానీ, ఆయా శాఖల అధిపతులు అప్పటికే జాబితాలు పంపటంతో పాటు పీవోలు, ఏపీవోలు శిక్షణకు హాజరవుతున్నారు. ఓపీవోలకు 25న శిక్షణ ఉంటుంది. వీరు విధుల నుంచి మినహాయింపు పొందాలంటే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు ఆధారాలతో ఆ శాఖ అధిపతితో సర్టిఫికేషన్ చేయించుకొని జిల్లా ఎన్నికల అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. అధారాలు సరిచూసి మినహాయింపునిస్తారు. నిబంధన కఠినంగా ఉండటంతో వీరి ప్రయత్నాలు ఫలించలేదు.


మరుగుదొడ్డి, స్నానాలు..

ప్రభుత్వ భవనాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో పాఠశాల ప్రాంగణాల్లో ఎక్కువగా ఉన్నాయి. రాత్రివేళ బస చేసిన సందర్భంలో ఆయా చోట విద్యుత్తు సౌకర్యం, అత్యవసరానికి మరుగుదొడ్లు, స్నానాలు చేసేందుకు నీటి సౌకర్యం ఉండాలని ఉద్యోగులు కోరుతున్నారు. అయితే కొన్నిచోట్ల మినహా చాలాచోట్ల మరుగుదొడ్డి సౌకర్యం ఉంది. కానీ, వాటి నిర్వహణ సరిగా అపరిశుభ్రంగా మారి వినియోగించలేని స్థితిలో ఉన్నట్లుగా చెబుతున్నారు. వీటిని వినియోగానికి సిద్ధం చేయించటంతో పాటు.. లేనిచోట నిర్మాణం జరిపించేలా చూడాల్సి ఉంది. పోలింగ్ విధుల్లో మహిళా ఉద్యోగులు పెద్దసంఖ్యలో ఉండనున్నారు. ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో వీరిని దృష్టిలో పెట్టుకోవాలి.

ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం- రాజీవ్‌గాంధీ హన్మంతు, జిల్లా ఎన్నికల అధికారి పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశాం. విద్యుత్తు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం ఉంది. ఇబ్బంది ఉన్న కేంద్రాల విషయంలోనూ పరిశీలన చేశాం. ఆయాచోట్ల మరుగుదొడ్ల మరమ్మతులు, నిర్మాణం చేపడుతున్నాం. రవాణా సౌకర్యం విషయంలోనూ ఇబ్బంది ఉండదు. ఏర్పాట్లపై మండల స్థాయిలో అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం. ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తాం.

# ఉపాధి కుంట.. అన్నదాతకు పంట

దహెగాం : ప్రస్తుతం నీటిఎద్దడితో అన్నదాతల పంటలు ఎండిపోతున్నాయి. వర్షాభావ పరిస్థితుల్లో ఉపయోగపడేలా దహెగాం మండలం ఈటపల్లి గ్రామానికి చెందిన రైతు బోరెం పోశయ్య వ్యవసాయ క్షేత్రంలో



ఉపాధిహామీ పథకం ద్వారా కుంట తవ్వించుకున్నారు. ప్రస్తుతం తనకున్న మూడెకరాల భూమిలో వర్షాకాలంలో రెండెకరాల వరి పంటకు సరిపడా నీటిని పారిస్తున్నారు. చి'వరికి' సాగు నీరందక అన్నదాతలు అతలాకుతలం అవుతుండగా పోశయ్య మాత్రం కుంటలో నీటిని తడిగా పెట్టుకొని పంటను పండిస్తున్నారు. మండలంలో మిగతా గ్రామాల్లోనూ రైతులు ఉపాధిహామీలో భాగంగా నీటికుంటలు తవ్వుకున్నా.. నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి.

# ఓట్ల వేటలో.. వ్యూహరచనలో..



ఖమ్మం : జిల్లాలోని ఓ జనరల్ నియోజకవర్గంలో ఓ పార్టీ అభ్యర్థి 'పోల్ స్ట్రాటజీ గ్రూప్' అనే యాప్‌లో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్లను నాలుగు విభాగాలు(రంగులు)గా విభజిస్తున్నారు. అనుకూలురు(గ్రీన్), తటస్థులు (ఎల్లో), స్థానికంగా ఓటుహక్కు కలిగి ఇతరచోట్ల నివసిస్తున్నవారు (బ్లూ), ఇతర పార్టీల మద్దతుదారులు (రెడ్)గా పరిగణిస్తున్నారు. మరోపార్టీ అభ్యర్థి సైతం ఇలాంటి విధానమే అవలంబిస్తున్నారు. ఓటర్లను 'పోల్ మేనేజ్‌మెంట్' అనే యాప్‌లో మూడు విభాగాలు (ఏ, బీ, సీ)గా వర్గీకరిస్తున్నారు. తనకు పక్కాగా ఓటేసేవారు (ఏ), తటస్థులు (బీ), ఇతర పార్టీల మద్దతుదారులను (సీ)లో చేర్చి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఖమ్మం జిల్లాలోని మరో జనరల్ నియోజకవర్గంలో పరిస్థితి విచిత్రంగా ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ సాయంత్రం వరకు ప్రచారం ముగించి.. ముఖ్య అనుచరులు, నాయకులు తమవైపే ఉన్నారా లేదా అని సమీక్షించుకుంటున్నారు. ప్రత్యర్థుల తాయిలాల వలకు చిక్కకుండా అప్రమత్తమవుతున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఓ నియోజకవర్గంలో త్రిముఖపోరు నెలకొంది. పోలింగ్ గడువు సమీపిస్తున్నకొద్దీ అభ్యర్థులకు ముచ్చెమటలు పడుతున్నాయి. తమ పరిస్థితి ఏంటనే అంశంపై తర్జనభర్జనలకే సమయం సరిపోతుందని ఆందోళన చెందుతున్నారు. ఓటర్లకు దగ్గరయ్యేందుకు ఆత్మీయ పలకరింపులకు పూనుకుంటున్నారు. వయస్సు, సామాజిక వర్గాలుగా ఓటర్లను విభజించి వారిని ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారు.

శాసనసభ ఎన్నికల సమరం జోరందుకుంది. పోలింగ్‌కు తొమ్మిది రోజుల గడువు ఉండటంతో విజయ సాధనకు అభ్యర్థులు చెమటోడ్చుతున్నారు. పోలింగ్ ముగిసే వరకూ తమవైపు అనుకూల పవనాలు వీచేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈక్రమంలో ఓటర్లను ఆకర్షించటంతో పాటు ప్రత్యర్థి శిబిరం నుంచి ముప్పు తప్పించుకునేందుకు వ్యూహప్రతివ్యూహాలు రచిస్తున్నారు.

పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ప్రచారమెలా సాగుతున్నా చివరి మూడు రోజులు పోల్ మేనేజ్‌మెంట్‌లో దిట్ట అనే పేరుంది. ప్రచారం ఎంత చేసినా, ప్రలోభపెట్టినా పోలింగ్ కేంద్రం వరకు ఓటరును తీసుకొచ్చే బాధ్యతలను ద్వితీయశ్రేణి నాయకులకు అప్పగిస్తుంటారు. ఓటేసే వరకు ఓటర్లను పలకరించేలా తన అనుచరులను పురమాయిస్తుంటారు. దూరభారంతో ఇబ్బంది పడే ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేర్చేలా ప్రత్యేకంగా ఆటోలు, ఇతర వాహనాలను సమకూర్చుతుంటారు.

సంఘాలతో సమావేశాలు

వైద్యులు, ఆర్ఎంపీలు, మెడికల్, లారీ అసోసియేషన్లు, ఆటో డ్రైవర్లు, దర్జీలు, నాయీబ్రాహ్మణులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, చేతివృత్తుల సంఘాలను ప్రసన్నం చేసుకునేలా కీలక నేతలకు బాధ్యతలు అప్పగించారు. ఆయా వర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోరుకున్న వారికి ప్రత్యేక 'పార్టీలు' ఇస్తూ పోలింగ్ నాటికి అంతా చక్కబెట్టుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పది నియోజకవర్గాలున్నాయి. అన్నిచోట్లా ఇంచుమించు ఇదే వైఖరిని ప్రధాన పార్టీల అభ్యర్థులు అనుసరిస్తున్నారు. అనుకూల ఓటర్లు చేజారకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే తటస్థులు, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని తమవైపు తిప్పుకొనేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఇతర పార్టీల మద్దతుదారుల కదలికలపైనా నిఘా ఉంచుతున్నారు. అనుకూల ఓటర్లకు మర్యాద తగ్గకుండా చూస్తున్నారు. నియోజకవర్గం, మండలం, గ్రామస్థాయిలో ప్రాబల్యం చూపేవారి కోరికలను వెనువెంటనే తీర్చేస్తున్నారు. తటస్థ ఓటర్లు ఏం ఆశిస్తున్నారో తెలుసుకొని వారిని ఆకర్షించేందుకు ఎంత ఖర్చుకైనా వెనకాడొద్దని ప్రధాన అనుచరులకు స్పష్టంగా చెబుతున్నారు. మరోవైపు ఇతర పార్టీల మద్దతుదారులు రోజువారీగా ఎక్కడెక్కడ సంచరిస్తున్నారు?ఎవరెవరితో మాట్లాడుతున్నారు? అనే అంశాలపై ఆరాతీస్తున్నారు. అవసరమైతే అలాంటి వారిలో ఒకరిద్దరిని కోవర్టులుగా మార్చుకునేందుకూ యత్నిస్తున్నారు.

వన భోజనాలను అవకాశంగా మలచుకునేలా..

ఇప్పటికే కార్తికమాసం సందడి మొదలైంది. సామాజికవర్గాల వారీగా వనభోజనాలు ఏర్పాటు చేసుకోవటం సంప్రదాయంగా వస్తోంది. ఈసారి వీటినీ తమ విజయానికి అనుగుణంగా మలచుకోవాలని కొందరు అభ్యర్థులు యత్నిస్తున్నారు. ఈనెల 30లోపే కీలక ప్రాంతాల్లో వనభోజనాలను ముగించాలని కసరత్తు చేస్తున్నారు. ఇందుకు అయ్యే ఖర్చును భరించటానికి సిద్ధపడుతున్నారు.

# పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం



ఖమ్మం : దివ్యాంగులు, వయో వృద్ధుల కోసం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైందని, ఇందుకోసం జిల్లాలో 30 బృందాలను నియమించినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఇటీవల జిల్లాకు వచ్చిన అదనపు బ్యాలెట్ యూనిట్లు ఫస్ట్ లెవల్ చెక్(ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జడ్పీ సమావేశ మందిరంలో ఈసీఐఎల్ ఇంజినీర్లు సోమవారం చేపట్టారు. ఈ ప్రక్రియను ఎన్నికల పరిశీలకుడు తుషార్ కాంత మహంతితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమైనందున రాజకీయ పార్టీలు తమ ఏజెంట్లను నియమించాలని సూచించారు. హోం ఓటింగ్ కోసం దివ్యాంగులు, వయో వృద్ధులు 1,564 మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మూడు చొప్పున, సత్తుపల్లిలో రెండు చొప్పున బ్యాలెట్ యూనిట్లు అవసరమని, జిల్లాకు 894 అదనంగా తెప్పించినట్లు తెలిపారు. ఎఫ్ఎల్‌సీ తర్వాత ర్యాండమైజేషన్ చేపట్టి నియోజకవర్గాలకు కేటాయిస్తామన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ చేపడతామని చెప్పారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తిరుమలరావు, గెంటేల విద్యాసాగర్, ప్రకాశ్, సయ్యద్ హుస్సేన్, సతీశ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణకు వాహనాలు సిద్ధం చేయాలి: కలెక్టర్

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రి తరలింపునకు వాహనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ విభాగాల నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బస్సులకు జీపీఎస్ అమర్చాలని, దివ్యాంగులను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు వాహనాలు సమకూర్చాలన్నారు. ప్రతి ఎస్ఎస్‌టీ బృందంతో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని కేటాయించాలని, అనుమానిత యూపీఐ(డిజిటల్) లావాదేవీలపై విచారణ చేపట్టాలని చెప్పారు. చెక్‌పోస్టుల్లో ఎస్ఎస్‌టీ బృందాలు అన్ని రకాల వాహనాలు తనిఖీ చేయాలని సూచించారు. అదనపు డీసీపీ ప్రసాదరావు, స్వీప్ నోడల్ అధికారి కొండపల్లి శ్రీరామ్, నోడల్ అధికారులు శ్రీలత, సుమ, విజయనిర్మల, కిషన్‌రావు, సోమశేఖరశర్మ, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ రోజే..పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ రోజే పోస్టల్ బ్యాలెట్ అందించి వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జిల్లాలోని రిటర్నింగ్ అధికారు లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలకు సమాచారం అందించి ఆయా పార్టీల ఏజెంట్లు హాజరయ్యేలా చూడాలన్నారు. ఆర్వో కార్యాలయం వద్ద ఎసెన్షియల్ ఓటర్లకు ఓటింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. డీఈఓ సోమశేఖరశర్మ, డీపీఓ విజయనిర్మల, మాస్టర్ శిక్షకుడు కొండపల్లి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల నేపథ్యంలో కొణిజర్లలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భాగంగా కలెక్టర్ గౌతమ్ వాహనాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్.. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ, పోలీస్, అభ్యర్థులు, రాజకీయ నాయకులు, అంబులెన్స్‌లు, గూడ్స్, తదితర వాహనాలన్నింటినీ తనిఖీ చేయాలని ఆదేశించారు.

# బరిలో అత్యధికులు స్వతంత్రులే

కామారెడ్డి: ఏ ఎన్నికల్లోలైనా గెలుపోటములు సహజం. వాటి సంగతి పక్కనపెడితే. పోటీలో నిలిచినవారిలో కనీసం డిపాజిట్ దక్కనివారూ ఉంటారు. ఈ సారి ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల నుంచి 144 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇందులో 56 మంది స్వతంత్ర అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ప్రధాన పార్టీల కంటే ఇతర పార్టీలతో పాటు స్వతంత్రులు అధిక సంఖ్యలో బరిలో నిలిచారు. గత, ప్రస్తుత పోటీ పరిస్థితులపై కథనం.

1/6 వంతు ఓట్లు సాధిస్తేనే...ప్రజాప్రాతినిధ్య చట్టం 1961 నిబంధనల ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ వేసే సమయలో సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తారు. ఆ నియోజకవర్గంలో జరిగిన పోలింగ్‌లో నోటాకు వేసినవి, పోస్టల్ ఓట్లలో చెల్లకుండా పోయినవి తొలగిస్తారు. ఆ తర్వాత ఉన్న చెల్లుబాటైన ఓట్లలో 1/6 వంతు సాధించిన వారికి డిపాజిట్ చెల్లిస్తారు. అంతకంటే తక్కువ ఓట్లు సాధించని వారి డిపాజిట్‌ను జప్తు చేస్తారు. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 91 మంది అభ్యర్థులు పోటీచేయగా.. 72 మందికి ధరావతు దక్కలేదు. బాల్కొండలో బీఎస్పీ అభ్యర్థి మినహా స్వతంత్రులు, ఇతర పార్టీల అభ్యర్థులకు డిపాజిట్‌లు దక్కలేదు.

# బాధలు చూసి.. భరోసా నింపి

ఎదులాపురం: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ఒక పక్క ప్రజలకు చట్టాలు, న్యాయ సహాయం, హక్కులపై అవగాహన కల్పిస్తూనే మరో పక్క ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తోంది. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దినపత్రికల్లో ప్రచురితమయ్యే కథనాల ఆధారంగా ఆయా శాఖాధికారులకు తాఖీదులు జారీ చేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తోంది. కుటుంబ తగాదాలు, కలహాలు, తదితరాలను పరిష్కరిస్తూనే ప్రజా సమస్యలపై స్పందించి సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

నిలిచిపోయిన పింఛను ఇప్పించారు

బేల మండలం గణేష్‌పూర్ పంచాయతీ ఖడ్కీ గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలు కుమ్ర కోబాయి(31) సదరం ధ్రువపత్రం కాలపరిమితి పూర్తి కావటంతో పింఛను నిలిచిపోయింది. వారిది నిరుపేద కుటుంబం. పింఛను పునరుద్ధరణ కోసం ఆమెతో పాటు తల్లిదండ్రులు పలువురు అధికారులను కలిసినా ఫలితం లేకుండా పోయింది. గత మేలో దివ్యాంగురాలితో పాటు తల్లిదండ్రులు బేల ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. వారి దయనీయ స్థితిపై కథనం ప్రచురితం కాగా స్పందించిన డీఎల్ఎస్ఏ సంబంధిత అధికారులకు తాఖీదులిచ్చి ఆమెకు సదరం ధ్రువపత్రం అందజేసి, పింఛను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు.



నేరుగా సంప్రదించవచ్చు డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్, డీఎల్ఎస్ఏ ఛైర్మన్ప్రజలు ఏవైనా సమస్యలు ఎదుర్కొన్నట్లయితే నేరుగా డీఎల్ఎస్ఏను సంప్రదించి న్యాయం సహాయం పొందవచ్చు. ప్రభుత్వ శాఖల నుంచి పొందాల్సిన లబ్ధిలో జాప్యం చోటు చేసుకున్నా సంప్రదించవచ్చు. న్యాయ సహాయం అందించడానికి డీఎల్ఎస్ఏ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుంది.

విద్యార్థుల సంక్షేమంపై దృష్టి

ఉట్నూర్ ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటలను న్యాయమూర్తి దుర్గారాణి పరిశీలించారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు తరచూ పలు వసతిగృహాలు, పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను, వారికి అందిస్తున్న భోజనాలను సైతం పరిశీలిస్తున్నారు.

ఖైదీల్లో పరివర్తనకు కృషి

ఖైదీల్లో పరివర్తన కోసం డీఎల్ఎస్ఏ కృషి చేస్తోంది. తరచూ జిల్లా జైలులో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తూ చట్టాలు, శిక్షలు, న్యాయ సహాయం తదితర అంశాలపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. శిక్షా కాలం పూర్తయి బయటకు వచ్చాక గౌరవప్రదమైన జీవనం సాగించేలా కృషి చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య సేవలందిస్తున్నారు. జిల్లా అదనపు న్యాయమూర్తి పి.శివరాంప్రసాద్ జిల్లా జైలులోని ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నదే ఈ చిత్రం.

# ఎన్నికల విందు.. భలే పసందు

మంచిర్యాల : ఓటుకు పోటెత్తేందుకు మరో తొమ్మిది రోజులు మాత్రమే మిగిలి ఉంది. అభ్యర్థులు ప్రచారాలు మరింత ఉధృతం చేస్తున్నారు. సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తుండగా అధికార, ప్రతిపక్ష పార్టీలతో పాటు పోటీలో ఉన్నవారు తమ విజయం కోసం చెమటోడుస్తున్నారు. ఓ వైపు అభ్యర్థుల మధ్య మాటల మంటలు కొనసాగుతుండగా ఏర్పాటు చేస్తున్న ఆయా కార్యక్రమాల్లో వంటల మంటల వేడి తగ్గడం లేదు. తెల్లవారడం ఆలస్యం.. వారి నివాసాల్లోనే కాకుండా సమావేశాల ప్రాంతాల్లో వంటకాల వాసనలు ఘుమఘుమలాడుతున్నాయి. నిత్యం వేలమందికి విందు భోజనాలు సిద్ధం చేస్తున్నారు. అభ్యర్థి ఇంట్లో అయితే టీ నుంచి మొదలై అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఇలా నిర్విరామంగా జరుగుతూనే ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తున్నాయని సూచనప్రాయంగా తెలియగానే వారి నివాసాల్లో వాతావరణం పూర్తిగా మారిపోగా పోలింగ్ తేది దగ్గర పడుతుండటంతో మరింత సందడిగా మారాయి. వీటితో వంట మనుషులకు ఉపాధి కలుగుతుండగా మాంసాహార కేంద్రాలు, కూరగాయల వ్యాపారులకు గిరాకీ ఒక్కసారిగా పెరిగిపోయింది.

మంచిర్యాల నియోజకవర్గానికి చెందిన ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి.. నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో తప్పనిసరిగా భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. పది, వంద, వెయ్యి ఇలా సంఖ్యతో సంబంధం లేకుండా ఎంతమందికైనా తన నివాసంలోనే సిద్ధం చేయిస్తున్నారు. సభలు, సమావేశాలు ఎక్కడ జరిగినా అక్కడికి తరలిస్తున్నారు. నెలరోజుల నుంచి ప్రతిరోజు దాదాపు 4 నుంచి అయిదు క్వింటాళ్ల చికెన్ వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు పట్టణంలోని ఓ దుకాణంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.ఆదిలాబాద్ నియోజకవర్గానికి చెందిన ఓ పార్టీ అభ్యర్థి వంటలు చేయకుండా పలు హోటళ్లతో ఒప్పందం కుదర్చుకున్నట్లు సమాచారం. పట్టణాల్లో ప్రచార సభలు, సమావేశాలు జరిగితే మాంసాహారంతో కూడిన భోజనాన్ని హోటల్‌లో ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఖర్చు పూర్తిగా అభ్యర్థులే భరిస్తున్నారు. గ్రామాల్లో మాత్రం ప్రత్యేకంగా వంటకాలు చేయిస్తున్నట్లు తెలిసింది. మూడు ప్రధాన పార్టీలకు చెందిన పది నియోజకవర్గాల్లో 30 మంది పోటీల్లో ఉండగా సగానికి పైగా అభ్యర్థులు ప్రతిరోజు 2-3 క్వింటాళ్ల చికెన్ కొనుగోలు చేస్తున్నారు.

రాష్ట్ర నాయకుల ప్రచార సమయాల్లో 1 నుంచి 2 టన్నుల వరకు విక్రయం జరుగుతుంది.

ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ఇటీవల పదివేల మందికి పైగా మాంసాహార భోజనం సిద్ధం చేయించారు.

పేరుపొందిన ఒక మాంసాహార కేంద్రంలో సాధారణ రోజుల్లో 4 నుంచి 5 క్వింటాళ్లు విక్రయం జరగగా ఈ ఎన్నికల సమయంలో అదే కేంద్రంలో 10 నుంచి 15 క్వింటాళ్లు అమ్మకాలు ఉన్నాయి.

జనరల్ స్థానాల్లో భారీగా..విందు భోజనాలు(మాంసాహారం)ఎక్కువగా ఉమ్మడి జిల్లాలోని జనరల్ స్థానాల్లోనే జరుగుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కాగజ్‌నగర్ నియోజకవర్గాల్లో భారీగా చికెన్ విక్రయిస్తున్నారని తెలిసింది. మిగతా చోట్ల ముఖ్యమైన సభల్లో మాత్రమే మాంసాహారంతో కూడిన భోజన సదుపాయం కల్పిస్తుండగా సాధారణ సమయంలో శాకాహారంతోనే సర్దుబాటు చేస్తున్నట్లు సమాచారం.మూడింతలు పెరిగిన విక్రయాలు..ప్రధాన పట్టణాల్లోని మాంసం విక్రయ కేంద్రాల నిర్వాహకులను సంప్రదించగా కార్తిక మాసం మొదలైతే అమ్మకాలు తగ్గుతాయని, ఎన్నికల సందడితో మూడింతలు పెరిగిందని చెబుతున్నారు. మామూలు రోజుల్లో ఉదయాన్నే సిద్ధం చేయిస్తుండగా ముఖ్యనాయకుల ప్రచార కార్యక్రమాలు ఉంటే అర్ధరాత్రి నుంచే పనులు మొదలుపెట్టాల్సి వస్తుందని తెలుపుతున్నారు.

# ప్రచార భాగస్వాములు

జగిత్యాల: 'ప్రతి మగవాడి విజయం వెనుక ఓ మహిళ ఉంటుంది..' అంటారు. ఈ నానుడిని నిజం చేస్తూ ఎన్నికల సమరాంగణంలో మేము సైతం అంటూ అతివలు భాగస్వాములవుతున్నారు. సభలు, సమావేశాల్లో పాల్గొనడమే కాకుండా, ఇంటింటి ప్రచారంలో ముందుంటున్నారు. తోటి మహిళలతో కలిసి బొట్టు పెట్టి మరీ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. భర్త విజయం కోసం అలుపెరగకుండా నిత్యం ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ తరహా ప్రచారం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. పార్టీ తరఫున నిర్వహించే వేదికలపైనా అభ్యర్థుల సతీమణులు మాట్లాడుతూ ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేస్తున్నారు.

మా ఆయనకే ఓటేయండి

కరీంనగర్‌లో మంత్రి, భారాస అభ్యర్థి గంగుల కమలాకర్ సతీమణి రజిత, కాంగ్రెస్ అభ్యర్థి పురమల్ల శ్రీనివాస్ భార్య, జడ్పీటీసీ సభ్యురాలు లలిత ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

కోరుట్ల భారాస అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ భార్య దీప్తి, సోదరి సమత ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు తరఫున ఆయన భార్య రజని, భాజపా అభ్యర్థి అర్వింద్ సతీమణి ప్రియాంకలు ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పెద్దపల్లిలో భారాస అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి భార్య పుష్పలత, రామగుండంలో కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

జగిత్యాలలో భారాస అభ్యర్థి సంజయ్‌కుమార్ గెలుపు కోసం సతీమణి రాధిక శ్రమిస్తున్నారు. చొప్పదండిలో సుంకె రవిశంకర్ భార్య దీవెన సమావేశాలు, ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు.

కొంగు పట్టి అడుగుతున్నా..'ఈ ప్రాంత ఆడబిడ్డనై మీ అందరి ముందు కొంగు పట్టి అడుగుతున్నా.. ఓటు భిక్ష వేయండి' అంటూ హుజూరా



బాద్ భారాస అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి భార్య శాలినిరెడ్డి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి సభలోనూ ఆమె ఇలాగే అడిగారు. ఎన్నికల కంటే ముందే వినాయక నవరాత్రి ఉత్సవాలు, దసరా, బతుకమ్మ వేడుకల్లోనూ శాలినిరెడ్డి అతివలతో కలిసి పాల్గొన్నారు. వీరి కూతురు శ్రీనికరెడ్డి కూడా ముఖ్యమంత్రి సభ సహా పలు కార్యక్రమాల్లో మాట్లాడుతూ ఓట్లు అడిగింది.

ప్రజాప్రతినిధిగా పర్యవేక్షణ

మంథని భారాస అభ్యర్థి పుట్ట మధూకర్ భార్య, పురపాలక ఛైర్‌పర్సన్ శైలజ ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. పట్టణంలో విస్తృతంగా పర్యటిస్తూ భారాస ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు భర్త గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిపై ప్రచారం చేస్తున్నారు. స్థానిక మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. వివిధ కార్యక్రమాల నిర్వహణ, సమీక్షలతో పాటు రోజువారీ ప్రచారంపై ఆమె తెలుసుకుంటున్నారు. అతిరథుల సభల సమయంలోనూ సూచనలు చేస్తున్నారు.

అక్కడ రాజేందర్.. ఇక్కడ జమున

భాజపా నేత ఈటల రాజేందర్ ఈసారి రెండు చోట్లా పోటీ చేస్తుండగా గజ్వేల్‌లో ప్రచారానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. దీంతో హుజూరాబాద్ స్థానంలో ప్రచార బాధ్యతలను ఆయన సతీమణి జమున మోయాల్సి వస్తోంది. ప్రతి ఎన్నికతో పాటు గతంలో పార్టీ మారిన సందర్భంలోనూ ఆయన తరఫున మాట్లాడిన జమున హుజూరాబాద్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ మ్యానిఫెస్టోపై ప్రచారం చేస్తున్నారు.

వికాస్ వెన్నంటే దీప

వేములవాడ భాజపా అభ్యర్థి చెన్నమనేని వికాస్ భార్య డాక్టర్ దీప భర్త వెన్నంటే ఉంటూ ఎన్నికల ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సామాజిక సేవలో పాల్గొన్నప్పటి నుంచే ఇద్దరూ కలిసే వివిధ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఎన్నికల ప్రకటన అనంతరం ఆమె వేములవాడ నియోజకవర్గంలోని భాజపా నేతలు, కార్యకర్తలు తదితర వివరాలను కంప్యూటరీకరించి నేరుగా కార్యక్రమాలను సమీక్షిస్తున్నారు. రోజువారీ కార్యక్రమాల నిర్వహణలపై బాధ్యులతో మాట్లాడుతున్నారు.

## వారంతా.. ముందే ఓటేస్తారు

హైదరాబాద్: శాసనసభ ఎన్నికల పోలింగ్ ఈ నెల 30న జరుగుతుండగా.. హైదరాబాద్ జిల్లాలోని 857 మంది మాత్రం మూడు రోజుల ముందే ఓటేయనున్నారు. 80ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఆ సదుపాయాన్ని కల్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం.. 'ఇంటి వద్ద ఓటు'కు హైదరాబాద్‌లో 966 దరఖాస్తులొచ్చాయని, వాటిలో 857 ఆమోదం పొందాయని అధికారులు తెలిపారు.

: ఎంపికైన ఓటర్లతో ఓటు వేయించుకోవడమే తరువాయి. ఆ మేరకు ఆర్వోలు రెండు తేదీలను చెప్పాల్సి ఉంటుంది. మొదటి తేదీన ఓటు వేయడం కుదరకపోతే, రెండో తేదీలో వేయొచ్చు. అదే సమయంలో.. సంబంధిత అధికారులు.. ఆయా ఓటర్లు, వారు ఓటు వేసే తేదీలను పోటీలోని అభ్యర్థులకు తెలియజేస్తారు.

సాధారణ పోలింగ్ కేంద్రం మాదిరే..: ఓటరు ఇంటికి అధికారులు వెళ్లి తాత్కాలిక గదిని ఏర్పాటు చేస్తారు. ఓటరు అందులోకి వెళ్లి బ్యాలెట్ పేపరుపై నచ్చిన అభ్యర్థికి ఓటు వేయొచ్చు. అనంతరం.. బ్యాలెట్ పేపరును చిన్నపాటి కవరు(ఫాం-13బీ)లో ఉంచి ఎన్నికల అధికారికి ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే.. ఓటు వేసినట్లు ధ్రువీకరణపత్రంపై(ఫాం-13ఏ) ఓటరు సంతకం చేయాలి. ఆ రెండు ఫాంలను పెద్ద కవరులో(ఫాం-13సీ) వేసి, ఓటరు ముందే సీల్ చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం పోలింగ్‌కు మూడు రోజుల ముందే(నవంబరు 27) పూర్తవ్వాలనేది నిబంధన.

# మాట జారితే.. మర్యాద పోద్ది



హైదరాబాద్: గ్రేటర్ రాజకీయం రోజు రోజుకు వేడెక్కుతోంది. అభ్యర్థుల నోటి నుంచి మాటలు తూటాలు పేలుతున్నాయి. ప్రచారంలో కొందరు అభ్యర్థులు అసహనంతో వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. కొన్నిసార్లు రాయలేని భాషలో నోరు జారుతున్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మాట్లాడితే కేసుల్లో చిక్కుకునే అవకాశం ఉంది. ఎన్నికల్లో జరిగే అక్రమాలు...నిబంధనలకు విరుద్ధంగా జరిగే ప్రచారాలు...వ్యక్తిగత దూషణలు తదితర అంశాలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం ఇప్పటికే సి-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. నేతల నుంచి సామాన్యుల వరకు ఎవరైనా ఈ యాప్‌ను తమ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఇప్పటివరకు తెలంగాణలో ఎన్నికలకు సంబంధించి సి-విజిల్ ఇతర మార్గాల ద్వారా అన్ని పార్టీలకు సంబంధించి 25 వేల వరకు ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ నుంచి దాదాపు 10 వేల వరకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. నామినేషన్ల ఘట్టం ముగిసిన నేపథ్యంలో ఈ నెల 28 వరకు ప్రచారం హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు రెట్టింపయ్యే పరిస్థితులు ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని నేతలు దూషణలు, భావోద్వేగాలు రెచ్చగొట్టకుండా ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది.

ఇలా చేయొద్దు..

ముఖ్యంగా కులాలు, మతాలు జాతుల మధ్య, మతపరమైన లేక భాషాపరమైన ఉద్రేకాలు సృష్టించేలా ప్రసంగాలు చేయడం.. రెచ్చగొట్టడం ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని గుర్తించాలి. అభ్యర్థుల వ్యక్తిగత జీవితాల గురించి ఆరోపించడం...వారి కుటుంబ సభ్యులను అవమానపరిచేలా మాట్లాడటం..అనవసర ఆరోపణలు, వక్రీకరణలు చేయడం సరికాదని గుర్తించాలి.

ప్రత్యర్థి పార్టీలనే కాకుండా ఓటర్లను ప్రలోభపెట్టడం..ఓటు వేయకపోతే సంగతి చూస్తామని బెదిరించడం..దాడులకు దిగడం నేరం. అసలు ఓటర్లకు బదులు వేరే ఓటర్లను తెచ్చి ఓట్లు వేసే ప్రయత్నం చేయడం లాంటివి కూడా నేరంగా పరిగణిస్తారు.

ప్రత్యర్థుల ఇంటి ముందు బాహాబాహీకి దిగడం..వ్యతిరేక ప్రదర్శనలు చేయడం, అనుచరులతో అక్కడే తిష్ఠవేసి ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించడం లాంటి చర్యలు నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుంది. ఎదుటి వ్యక్తి అనుమతి లేకుండా వారి ఇంటి గోడలపై రాతలు రాయడం, జెండాలు అంటించడం, పాతడం లాంటి చర్యలు చట్ట విరుద్ధం. ఇతర పార్టీలు నిర్వహించిన సమావేశాలను అడ్డుకోవడం, అడ్డంకులు కలిగించడంపై అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలి.

# కీలక నియోజకవర్గాల అభ్యర్థుల్లో గుబులు



హైదరాబాద్: ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ కొత్త సమీకరణలు తెరపైకి వస్తున్నాయి. పోటీ నువ్వా నేనా అన్నట్లు సాగే.. కొన్ని నియోజకవర్గాల్లో ప్రతి ఓటు కీలకం కానుంది. ఈ నేపథ్యంలో గతంలో పలు ఎన్నికల్లో పోటీచేసి, ప్రస్తుతం పోటీలో లేని పార్టీలే కాకుండా.. ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేయని చిన్నాచితక పార్టీల ఓటు.. ఎవరికి అనుకూలం లేదా ప్రతికూలం అవుతుందోననే గుబులు అభ్యర్థుల్లో కన్పిస్తోంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం గ్రేటర్‌లో ఏకంగా 9 స్థానాల్లో గెలుపొందింది. కంటోన్మెంట్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, కుత్బుల్లాపూర్, మహేశ్వరం, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. తర్వాత మారిన రాజకీయ సమీకరణాల్లో గెలిచిన వారంతా అధికార పార్టీలో చేరారు. అనంతరం 2018 ఎన్నికల్లో తెదేపా గ్రేటర్‌లో ఖాతా తెరవలేదు. అయినప్పటికీ కొంత ఓటుబ్యాంకు మాత్రం నిలబెట్టుకుంది. వివిధ కారణాలతో ఈసారి ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. దీంతో ఆయా నియోజకవర్గాల్లో తెదేపా కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు కీలకంగా మారనున్నాయి. అన్ని ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు.. కింద స్థాయి నేతలు, ఇతర క్యాడర్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

ఇక్కడ ప్రత్యేక దృష్టి..ముఖ్యంగా రాజేంద్రనగర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ మద్దతు కూడగడుతున్నారు. ఇటీవల వరకు వైతెపా గ్రేటర్‌తో పాటు అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించినప్పటికీ.. తర్వాత విరమించుకుంది. కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. అయితే కొద్దో గొప్పో ఉన్న ఈ పార్టీ క్యాడర్‌ను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్‌తో పాటు మిగతా పార్టీలు దృష్టి సారించాయి. ఆ పార్టీకి రాజీనామా చేసిన నాయకులను తమ పార్టీల్లోకి ఆహ్వానిస్తున్నారు. చిన్నాచితక పార్టీల అభ్యర్థులు పోటీలో లేనప్పటికీ.. ఆయా పార్టీల చోటామోటా నేతలు, క్యాడర్‌ను తమవైపు లాక్కునేందుకు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా ఆయా కులసంఘాలు ఇతర ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. పెళ్లి రోజు.. పుట్టినరోజు అంటూ దావత్‌లు ఏర్పాటు చేసి.. ఆయా క్యాడర్‌ను ఆహ్వానిస్తున్నారు. కొందరిని కండువాలను కప్పి పార్టీల్లోకి ఆహ్వానిస్తుండగా, మరికొందర్ని తెరవెనుక నుంచి సాయం అందించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అభ్యర్థుల్లో ఆందోళన వీడటంలేదు.

# ప్రత్యేక కేంద్రం.. సౌకర్యాలు శూన్యం

ఆసిఫాబాద్: ఎన్నికల క్రతువులో ముఖ్యమైన పోలింగ్‌కు సరిగ్గా తొమ్మిదిరోజులే ఉంది. ఒకవైపు ఆయా పార్టీల అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నా, మరింత సమర్థంగా చేయాల్సిన అవసరం ఉందని కొన్నింటిని చూస్తే సులువుగా తెలుస్తోంది. ఒకరోజు ముందు పోలింగ్ కేంద్రానికి సిబ్బంది చేరుకుని అక్కడే గడిపి, మరుసటి రోజు పోలింగ్ పూర్తయ్యాక జిల్లా కేంద్రానికి రావాల్సి ఉంటుంది. విద్యుత్తు, తాగునీరు, దివ్యాంగుల కోసం ర్యాంపులు, మరుగుదొడ్లు, మూత్రశాలలను ఏర్పాటు చేయాలి. మహిళలు, దివ్యాంగులు, ఆదర్శ కేంద్రాలను ఎంపిక చేసినా వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ఒక్కో నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అయిదు మహిళల కోసమే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సిర్పూరు, ఆసిఫాబాద్‌లో 10 కేంద్రాలను అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 12 ఆదర్శ పోలింగ్ కేంద్రాలు, రెండు యువ, రెండు దివ్యాంగ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీఓ, ఏపీఓ, ఇద్దరు ఓపీఓలు ఉంటారు. మహిళల కోసం పది కేంద్రాలు ఉండగా, ఇక్కడంతా మహిళా సిబ్బందినే నియమించనున్నారు. దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలతో పాటు ప్రతీ కేంద్రంలో ర్యాంపులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు ఉండాలి. చాలాచోట్ల ఇప్పుడిప్పుడు పనులు చేస్తుండగా, కొన్నిచోట్ల ఎలాంటి పనులు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆసిఫాబాద్ మండలం మోతుగూడ దివ్యాంగ పోలింగ్ కేంద్రం ఇది. ఇక్కడ 923 మంది ఓటర్లు ఉన్నారు. ర్యాంపు సైతం నెలలో కుంగిపోయింది. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. రెండుమూడు రోజుల క్రితం పాఠశాల ఆవరణ ముందు ఇసుక వేశారు. దివ్యాంగుల చక్రాల కుర్చీలు సైతం ముందుకు కదలడం కష్టమే. పోలింగ్‌కు ముందురోజు వరకు మరుగుదొడ్లు, మూత్రశాలను పూర్తయ్యేలా చేస్తే మేలు. కొత్తకాలనీ, ఎస్పీ కాలనీ, పాతగూడెం, గొల్లగూడ ఓటర్లు ఇక్కడ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.



ఆసిఫాబాద్ మండలం ఇప్పల్‌నవేగాం మహిళా పోలింగ్ కేంద్రం ఇది. 693 మంది ఓటర్లు ఉన్నారు. పూర్తిగా మహిళా సిబ్బంది విధులు నిర్వహించే ఈ ప్రదేశంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నా.. వృథా నీరు వెళ్లడానికి ఏర్పాట్లు లేవు. సిబ్బంది, ఓటర్లకు ఇబ్బందులు తప్పేలా లేవు. దానాపూర్, తెనుగూడ, మన్నెగూడ, బారేగూడ, హనుమాన్‌గూడకు చెందిన ఓటర్లు ఇక్కడ ఓటేయనున్నారు.

వాంకిడి మండలంలో ప్రాథమిక పాఠశాలను మహిళా పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యుత్తు సౌకర్యం లేదు. మరుగుదొడ్లు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ మహిళా సిబ్బంది ఎలా ఉంటారో అధికారులకే తెలియాలనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం 806 ఓట్లు ఉన్నాయి. తపాలా కార్యాలయం రోడ్, పెర్కవాడ, తేలివాడ, హనుమాన్ మందిర్‌కు చెందిన ఓటర్లు ఈ కేంద్రం పరిధిలో ఓటేస్తారు.

# పదిలో లక్ష్య సాధనకు ప్రత్యేక తరగతులు

జగిత్యాల: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీని కోసం 'లక్ష్య' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 1 నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ ప్రారంభించి అమలు చేస్తున్నారు.

రోజుకో గంట...ప్రతి రోజు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు రోజుకో గంట చొప్పున ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ 1-2 సామర్థ్యాలకు సంబంధించి ప్రశ్నలు ఇచ్చి 30 నిమిషాల్లో స్లిప్‌టెస్టులు నిర్వహించాలి. ఈ పరీక్షల్లో ఆయా సామర్థ్యాలలో వెనుకబడిన పిల్లలకు బోధనపై ప్రత్యేక దృష్టి సారించేలా కార్యచరణ రూపొందించారు. తద్వారా ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నారు.

కరదీపికలు పదిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా పాఠశాలలకు 'లక్ష్య' పేరుతో సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలకు ఒకటి చొప్పున ప్రత్యేక కార్యాచరణ, పదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా కార్యాచరణతో కూడిన కరదీపికలు పంపిణీ చేశారు. దీంతో పాటు విద్యార్థులకు తెలుగు, హిందీ, ఆంగ్లం మినహా గణితం, భౌతిక-



రసాయన, జీవ, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు.

ప్రతిబంధకాలివే....ఈ విద్యా సంవత్సరంలో బదిలీలు, పదోన్నతులతో పాటు ఎన్నికల ప్రభావం పది ఫలితాలకు ప్రతిబంధకంగా మారనుంది. ఇప్పటికే జీహెచ్ఎంలు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వల్ల సుమారు 20 రోజుల పాటు బోధనపై ప్రభావం పడింది. ప్రస్తుతం శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారులుగా స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ వారికే విధులు కేటాయించారు. వీరికి శిక్షణ, సదస్సులు, ఎన్నికల విధి నిర్వహణ బోధనకు ఆటంకంగా మారనుంది. దీంతో డిసెంబర్ మాసాంతానికి సిలబస్ పూర్తి కావడం ప్రశ్నార్థకంగా మారింది. వీటన్నింటినీ అధిగమించి పదిలో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

## ఎడమకాల్వ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన ఎస్కేప్ గేట్

మునగాల : మండల కేంద్ర శివారులోని సాగర్ ఎడమ కాల్వపై ఉన్న బేతవోలు కాల్వ ఎస్కేప్ రెగ్యులేటర్ గేటు కొట్టుకుపోవడంతో మునగాల, చిలుకూరు మండలాల్లో కోతకు వచ్చిన పంట పొలాలు నీట మునిగాయి. తాగునీటి అవసరాల కోసం పాలేరు జలాశయానికి నాలుగు రోజుల క్రితం సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేశారు. రైతులు ఎస్కేపులు ఎత్తకుండా రాత్రివేళలో ఎన్నెస్పీ సిబ్బందిని కాపలా ఉంచారు. ఎడమ కాల్వపై 113 కి.మీ. వద్ద బేతవోలు కాల్వ ఎస్కేప్ రెగ్యులేటర్ ఉంది. నీటి ప్రవాహ ఉద్ధృతికి ఆదివారం రాత్రి 8.30



గంటల సమయంలో పెద్ద శబ్దంతో ఎస్కేప్ గేటు ఊడి కొట్టుకుపోయింది. ఈ వరద నీరు పంట పొలాల్లో చేరడంతో కోతకు వచ్చిన వందల ఎకరాల పంట పొలాలు నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లింది. ఎడమకాల్వపై బేతవోలు కాల్వ ఎస్కేప్ రెగ్యులేటర్ గేటు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకుందని గుర్తించి మరమ్మతుల పనులను ఓ గుత్తేదారునికి అప్పగించామని, ఈ లోగా ఈ ఘటన జరిగిందని ఎన్నెస్పీ డీఈ రఘు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి ఎడమకాల్వకు నీటిని నిలిపి వేశామన్నారు. కొత్త గేటు తీసుకొస్తున్నామని, ఎడమ కాల్వలో నీటి మట్టం తగ్గిన వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు. ఘటన స్థలాన్ని సీఈ రమేష్‌బాబు, ఎస్ఈ నర్సింహారావు, ఈఈ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని రైతులు ఆరోపించారు. కోతకు వచ్చిన పంట నీటి పాలుకావడంతో తమకు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

## ఉల్లంఘనులు

హైదరాబాద్: హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి(ఎంసీసీ) పకడ్బందీగా అమలయ్యేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచే ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీస్ అథారిటీ, చెక్‌పోస్టుల ఏర్పాటుతో నగరంలో తనిఖీలు మొదలయ్యాయి. ఇప్పటి వరకు మొత్తం 87 మందిపై కేసులు నమోదవగా, అందులో 85 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు, రెండు పెట్టీ కేసులున్నాయని అధికారులు స్పష్టం చేశారు. గోషామహల్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఎక్కువ ఉల్లంఘనలు జరుగుతున్నట్లు ఎంసీసీ నోడల్ అధికారి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు.

అతిక్రమణలు ఇలా..: కేసుల సంఖ్యను పరిశీలిస్తే భారాస, కాంగ్రెస్, భాజపా నేతలు వరుసగా నియమావళిని ఉల్లంఘిస్తున్నారని స్పష్టమవుతోంది. దినపత్రికలు, టీవీల్లో వచ్చే చెల్లింపు వార్తలు, డబ్బు, మద్యం పంపిణీ, నిషేధిత వేళల్లో ఎన్నికల ప్రచారం, ఓటర్లను ప్రలోభపెట్టే రకరకాల కార్యక్రమాలు, ఇతరత్రా ఉల్లంఘనలపై కేసులు నమోదు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

భారీగా మద్యం స్వాధీనం: జిల్లా పరిధిలోని 598 కేసుల్లో 68,226.6 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ రూ.3.62 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో రూ.24.32 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

# బోగస్ ఓట్లకు చెక్

జగిత్యాల : త్వరలో ఎన్నికలు జరిగే అయిదు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. మన రాష్ట్రంలోనూ ఎన్నికలు జరగనుండగా ఇంటింటికి వెళ్లి ఓటర్ల పరిశీలన కార్యక్రమం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇప్పటికే ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు ప్రారంభం కాగా నుంచి జూన్ 23 వరకు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేస్తారు. జూన్ 24 నుంచి జులై 24 వరకు పోలింగ్‌స్టేషన్ల గుర్తింపు జులై 25 నుంచి ఆగస్టు 31 వరకు సవరణలు, పరిశీలన, ముసాయిదా జాబితా ప్రచురణ సెప్టెంబర్ 2 నుంచి 31 వరకు అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా ప్రచురణ ఉంటుంది.

ఇంటింటికీ అధికారులు..

ఓటర్ల జాబితా సవరణ ఈసారి పకడ్బందీగా చేస్తున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 6,50,714 మంది ఉండగా అందులో 3,16,019 పురుషులు, 3,34,676 మంది స్త్రీలున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 2,14,996, కోరుట్లలో 2,24,452, ధర్మపురిలో 2,11,261 మంది ఓటర్లున్నారు. డబుల్ ఓట్లను తొలగించేందుకు ఓటర్ల జాబితాను ఆధార్‌కార్డులతో అనుసంధానిస్తున్నారు. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఇప్పటికే ఆధార్‌కార్డులు సేకరించటమే



కాకుండా రెండు ఓట్లుంటే ఏ ఓటు ఉంచాలనే విషయమై వారి నుంచి దరఖాస్తు తీసుకుని ఒక ఓటును తొలగిస్తున్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలపై దరఖాస్తులు తీసుకోవటమే కాకుండా పలుమార్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆరు ఓట్ల కంటే ఎక్కువ ఉన్న నివాసాలతోపాటు 10 మంది కంటే ఎక్కువగా 15 మంది, 20 మంది, 50 మంది, 100 మంది ఈ విధంగా ఎక్కువగా ఓట్లున్న ఇంటి నంబర్లను గుర్తించి ప్రత్యేకంగా విచారణ జరుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 14,050 ఇళ్లలో ఎక్కువ మంది ఓటర్లున్నట్లు గుర్తించారు. జగిత్యాల నియోజకవర్గంలో 5192, కోరుట్లలో 4865, ధర్మపురిలో 3993 ఇళ్లలో ఎక్కువ ఓట్లు ఉన్నట్లు గుర్తించారు.

అర్హులందరికీ ఓటుహక్కు-ఆర్.డి.మాధురి, ఆర్డీవో

ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టినప్పటికి జిల్లాలో కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాం. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకుని పరిష్కరిస్తున్నాం. రాజకీయ పార్టీల ప్రతినిధులతో పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేశాం. ప్రధానంగా బోగస్ ఓట్ల తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉన్న ఇళ్లను గుర్తించి అర్హుల ఆధార్‌కార్డులు సేకరించి మిగతా ఓట్లను తొలగిస్తున్నాం. 90 శాతం ఆధార్‌కార్డులను ఓటర్ల జాబితాల్లో అనుసంధానించడం వల్ల డబుల్ ఓట్లు తొలగిపోయాయి. ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యల మూలంగా ఈసారి అర్హులైన ప్రతిఒక్కరికి ఓటు హక్కు లభిస్తుంది.

# ఖని ఆసుపత్రికి ముస్కాన్ ధ్రువీకరణ

గోదావరిఖని : గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు అందిస్తున్న మెరుగైన వైద్య సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ మేరకు జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రితో పాటు ఖమ్మం, జనగామ, ఉట్నూరు, నల్గొండ, సంగారెడ్డి, అదిలాబాదు ఆసుపత్రుల్లోని చిన్న పిల్లల వైద్య విభాగాలకు 'ముస్కాన్' ధ్రువీకరణ లభించింది. ఇందులో జనగామ, ఉట్నూరు, నల్గొండ, అదిలాబాద్ (రిమ్స్) ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో ముస్కాన్ ధ్రువీకరణకు ఎంపిక కాగా.. గోదావరిఖని, ఖమ్మం, సంగారెడ్డి ఆసుపత్రులకు కొన్ని షరతులతో కూడిన ధ్రువీకరణ ఇచ్చారు. పన్నెండేళ్లలోపు వయసు గల పిల్లలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోను కార్పొరేట్ తరహా వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో జాతీయ ఆరోగ్య మిషన్ 'ముస్కాన్' పోటీలను ప్రవేశపెట్టింది. మొట్టమొదటి సారిగా ఇందుకోసం ఎంపిక చేసిన రాష్ట్రంలోని ఏడు జిల్లా, బోధన ఆసుపత్రులను పోటీలకు ఎంపిక చేశారు. మార్చి 22వ తేదీ నుంచి మే 4 వరకు 'నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్' ప్రతినిధులు ఆయా ఆసుపత్రుల్లోని చిన్న పిల్లల వైద్య



విభాగాల్లో అందిస్తున్న సేవలు, నిర్వహణ తీరును పరిశీలించి మార్కులు కేటాయించారు. దీని ఆధారంగా 'ముస్కాన్'లో ధ్రువీకరించారు.

చిరునవ్వును అందించడమే లక్ష్యం

అప్పుడే పుట్టిన శిశువు నుంచి 12 ఏళ్లలోపు పిల్లల ముఖాల్లో చిరునవ్వును అందించాలనే లక్ష్యంతో అదే అర్థం వచ్చేలా కేంద్ర ప్రభుత్వం 'ముస్కాన్' పథకాన్ని రూపొందించింది. ఈ పథకంలో పూర్తి స్థాయి ధ్రువీకరణకు ఎంపికైన ఆసుపత్రికి మూడేళ్ల పాటు ఏటా రూ.3 లక్షలు ఆర్థిక ప్రయోజనాలను అందిస్తోంది. షరతులతో కూడిన ధ్రువీకరణకు ఎంపికైన ఆసుపత్రులకు మొదటి సంవత్సరం మాత్రమే రూ.3 లక్షలు ఆర్థిక ప్రయోజనం చెల్లిస్తారు. విధించిన షరతులను పూర్తి చేసుకుంటూ రెండో సంవత్సరం మళ్లీ పోటీలో నిలవాల్సి ఉంటుంది. ఎన్‌క్వాష్ ప్రతినిధులు ఆయా ఆసుపత్రులను క్షేత్రస్థాయిలో పరిశీలించాక కేటాయించే మార్కుల ఆధారంగా 'ముస్కాన్' ధ్రువీకరణ లభించనుంది. ఆధారంగా ఆర్థిక ప్రయోజనాలు మంజూరు కానున్నాయి. కేంద్రం మంజూరు చేసే ఈ ప్రయోజనాల్లో 25 శాతం ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఇన్సెంటివ్‌గా చెల్లించి మిగతా 75 శాతం నిధులను చిన్న పిల్లల విభాగంలో మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.

# పైసా వసూళ్లే.. వారి ఖజానా!



వరంగల్ :'వరంగల్ నగరంలో ఓ ప్రధానోపాధ్యాయుడు రెండేళ్ల కిందట మృతి చెందారు. కొంతకాలానికి ఆయన భార్యకు క్యాన్సర్ సోకింది. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అందుకు సంబంధించిన మెడికల్ రీ-ఎంబర్స్‌మెంటు బిల్లులను క్లియర్ చేయాలని ఆమె పిల్లలు, బంధువులు కాళ్లరిగేలా తిరిగినా.. ఖజానా శాఖ అధికారులు కనికరించలేదు. కాసులు ఇవ్వకపోతే పనికాదని తేల్చిచెప్పడంతో అడిగినంత అందజేశారు. ఆరు నెలల కిందటే బిల్లు మంజూరైంది. ఇది జిల్లా ఖజానా శాఖలో అడ్డగోలు వసూళ్ల పర్వానికి ఓ ఉదాహరణ. జిల్లా ఖజానాశాఖలో వసూళ్ల పర్వం హద్దులు దాటుతోంది. ఇక్కడ పనిచేస్తున్న కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ముడుపుల దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రెవెన్యూశాఖలో కన్నా ఇందులోనే మామూళ్లు ఎక్కువనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉద్యోగుల వేతన బిల్లులు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ పార్ట్ ఫైనల్ బిల్లులు, మెడికల్ రీ-ఎంబర్స్‌మెంట్, ఎల్‌టీసీ, ఐటీ తదితర బిల్లులను క్లియర్ చేయాలంటే ఒక్కో బిల్లుకు ఒక్కో రేటు ఉంటుందని ప్రభుత్వ ఉద్యోగ వర్గాలే చెబుతున్నాయి. ఇళ్లనిర్మాణం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం తీసుకునే అడ్వాన్సులకు సంబంధించి ఉద్యోగులు సమర్పించిన బిల్లులను ఖాజానాశాఖలోని అధికారులు పరిశీలించి క్లియర్ చేసి ఈ-కుబేర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆర్థికశాఖ అనుమతితో బిల్లులు మంజూరవుతాయి. ఖజానాశాఖలో చేతులు తడపకపోతే ఏ బిల్లు పాసయ్యే అవకాశంలేదు.

ఆమె లెక్క వేరు!

జిల్లా ఖజానాశాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా అధికారిణి కనుసన్నల్లోనే వసూళ్ల పర్వం కొనసాగుతుందని బాధిత ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అడిగినంత ఇవ్వకపోతే.. దస్త్రాన్ని పక్కన పడేస్తారని చెబుతున్నారు. ప్రతీ పనికి ఓ పర్సెంటేజీ విధించారని, బిల్లుల స్థాయిని బట్టి రూ.1000 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు..

ఓ పాఠశాల ఉపాధ్యాయుడు మెడికల్ లీవ్ బిల్లుల క్లెయిమ్ కోసం 2022 నవంబరులో ఖజానాశాఖకు కావాల్సిన అన్ని డాక్యుమెంట్లను సమర్పించారు. నెలరోజులైనా బిల్లుల క్లియరింగ్ ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో.. సహోద్యోగుల సూచనతో ఆమెకు రూ.2 వేలు సమర్పించుకున్నారు.

ఇక్కడ షరా 'మామూలే'..

ప్రభుత్వశాఖల పరిధిలో జరిగే అన్ని అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులకు ఇక్కడ క్లియరెన్స్ తప్పనిసరి కావడంతో.. ఖజానాశాఖ అధికారుల ఆటలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అభివృద్ధి పనులను చేపట్టిన కాంట్రాక్టర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతిగృహాలకు అద్దెకు భవనాలిచ్చిన యజమానులు.. బిల్లుల క్లియరింగ్‌కు వారికి మంజూరయ్యే నిధులను బట్టి వసూళ్లకు పాల్పడుతున్నారని లబోదిబోమంటున్నారు. క్లియర్ అయిన వేల బిల్లులు నెలల తరబడి ఆర్థికశాఖ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నందున.. ఖజానాశాఖలోనూ బిల్లులు ఆలస్యం కావొద్దని ఖజనాశాఖ అధికారులు అడిగినంత ఉద్యోగులు ముట్టజెప్పుతున్నారు.

మచ్చుకు కొన్ని.. వరంగల్ కాశిబుగ్గలోని ఓ ఉపాధ్యాయుడు ఈ ఏడాది జనవరిలో జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ కోసం అన్ని డాక్యుమెంట్లను ఖజానాశాఖలో సమర్పించారు. బిల్లులతో పాటు రూ.1000 చెల్లించారు. ఇచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో.. కొన్ని బిల్లులను మిస్‌ప్లెస్ చేశారు. మరికొంత నగదు చెల్లించగా.. బిల్లును 3 నెలల తర్వాత క్లియర్ చేశారు. నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు ఐటీ రిటర్న్ చేసేందుకని ఒక్కొక్కరికీ అయితే రూ.1000 అని.. పాఠశాలలోని ఉపాధ్యాయులందరికీ కలిపి రూ.10 వేలు చెల్లించాల్సిందిగా ఖజానాశాఖ అధికారులు ఆఫర్ ఇచ్చారు. ఈ ఆఫర్ ప్రతి ఏడాది మార్చిలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు సుపరిచితమేనని చెబుతారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఓ ఉద్యోగి అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణమే లేదా 10 రోజుల్లోపు ఉద్యోగి కుటుంబ సభ్యులకు కర్మకాండలు నిర్వర్తించేందుకు రూ.20 వేలు చెల్లించాలి. ఆ కర్మకాండలకు అవసరమైన డబ్బులనూ 3 నెలలు గడిచినా.. బాధిత కుటుంబానికి చెల్లించకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనం.

అవినీతిపై ఏసీబీ దాడులు చేయాలి..

కమలాకరరావు, సమాచారహక్కు చట్టం ప్రచార సమితి సలహాదారు

అన్ని ప్రభుత్వశాఖల మాదిరి ఖజానాశాఖలోనూ ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. డబ్బులు ముట్టనిదే.. ఒక్క బిల్లును అధికారులు క్లియర్‌చేసిన దాఖలాలు లేవు. ఖజానాశాఖ బాధితులు అన్ని ప్రభుత్వశాఖల్లో ఉన్నారు. డబ్బులు ఇవ్వనివారి బిల్లులను పెండింగ్ పెట్టి వారిని మానసికంగా హింసిస్తున్నారు.

# పనులెలా ఉన్నా ముడుపులు ముట్టాల్సిందే..!

వరంగల్ : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తేనే పది కాలాల పాటు ఫలితాలిస్తాయి. ఇందులో పాలకవర్గానిదే కీలక పాత్ర. వారే కమీషన్లకు ఆశ పడితే పనులెలా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చు. అంతా సిండికేట్ అవుతూ ఒక ధరను నిర్ణయించి జేబులు నింపుకొంటున్నారు. పనులెలా ఉన్నా తమకు ముట్టాల్సిందేనని ఉమ్మడి జిల్లాలోని పురపాలికల ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నారు. గుత్తేదారులు వారడిగినంత ఇచ్చి పనుల్లో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. ఇది పురపాలికను బట్టి ఇది 5 నుంచి 11 శాతం వరకు ఉంటుంది. వీటికి తోడు మొదటి నుంచి ఆనవాయితీగా అధికారులకూ కొంత ముడుతోంది.

అసంతృప్తికి అదే కారణం!

ఆరుగురు గుత్తేదారులున్నారు. వీరు చేసే పనుల్లోంచి 11 శాతం కమీషన్ పాలకవర్గానికి ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కౌన్సిల్‌కు నేరుగా వచ్చే వివిధ పథకాల నిధులతో చేపడుతున్న పనుల్లోనే 5 శాతం పెద్ద తలకాయలకు, 6 శాతం చిన్న తలకాయలకు అందుతున్నాయి. పెద్ద పనులకు వస్తున్న నిధుల్లోంచి పైసా రావడం లేదంటూ కౌన్సిలర్లు ఆందోళనలు చేసిన ఘటనలున్నాయి. ఇప్పటికీ పాలకవర్గంలో అసంతృప్తికి కారణం అదేనని తెలుస్తోంది. మరో 9 శాతం అధికార యంత్రానికి వెళ్తున్నట్లు సమాచారం.

డొల్లతనమే నిదర్శనం

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 25 మంది వరకు లైసెన్స్ పొందిన గుత్తేదారులున్నారు. వారిలో పది మంది క్రమం తప్పకుండా టెండర్లు వేస్తారు. వీరిలో నలుగురు వార్డు కౌన్సిలర్లు బినామీలతో పనులు చేయిస్తున్నారు.. 36 వార్డుల్లో జరిగే అభివృద్ధి పనుల్లో పాలకవర్గానికి గుత్తేదారులు 4-5 శాతం ఇస్తున్నారు. అధికార యంత్రాగానికి మరో 8 శాతం ఇస్తున్నట్లు తెలిసింది. దాంతో పనుల్లో డొల్లతనం కనిపిస్తోంది.

ఒక్కటై పంచుకుంటారు..

నర్సంపేట పురపాలిక పరిధిలో 28 మంది గుత్తేదారులున్నారు. వీరంతా సంఘంగా ఏర్పడి పనులు పంచుకుంటారు. కమీషన్ల వ్యవహారం తేలకపోవడంతో రెండేళ్ల కిందట వేర్వేరు పద్దుల కింద నిధులు మంజూరైన పనులకు టెండర్లే పిలవలేదు. ఆ తర్వాత సమావేశమై 7 శాతం ఇచ్చేలా ఒప్పందం చేసుకోవడంతో టెండర్లు నిర్వహించారు. సంఘంలో సభ్యుడైన గుత్తేదారులు మాత్రమే టెండర్‌లో పాల్గొంటారు. బయట నుంచి ఎవరైనా ముందుకొస్తే పనులు చేయనివ్వరు. చేసినా బిల్లులు సకాలంలో చేతి కందవు.

వారే వీరు..

కౌన్సిలర్లే గుత్తేదారులు. దాంతో ముడుపుల గోల లేదు. అధికారులు, ఇంజినీరింగ్ విభాగం వారికి మాత్రం ఇవ్వాల్సిందే. జనవరిలో జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ డోర్నకల్ మున్సిపాలిటీకి రూ.25 కోట్లు ప్రకటించారు. వాటితో చేపట్టే పనులకు సంబంధించిన టెండర్లు కౌన్సిలర్లకు రావడం లేదు. వాటిని దక్కించుకునే గుత్తేదారుల నుంచి ఎంత తీసుకోవాలనే దానిపై అందరూ కలిసి సమీక్షించుకుంటున్నట్లు తెలిసింది.

తెలిసిన వారికే పనులు..

అభివృద్ధి పనులన్నీ ఒకే గుత్తేదారు చేస్తున్నారు. పాలకవర్గానికి కమీషన్ ఇవ్వకుండా కొన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు ఇచ్చారు. ఆ పనులను వారికి తెలిసిన వ్యక్తులకు అప్పగించి వారి నుంచి 7-10 శాతం ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది.

పనిని బట్టి..

ఏడుగురు గుత్తేదారులున్నారు. ఇందులో నలుగురు కౌన్సిలర్లు ఉంటారు. చేసే పనులను బట్టి పాలకవర్గం కమీషన్లు తీసుకుంటుంది. సీసీరోడ్డు, ఇతర పనులైతే 6-7 శాతం, డ్రైనేజీ నిర్మాణమైతే 8-10 శాతం తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒక వార్డులో పైపులైన్ పనులు దక్కించుకున్న గుత్తేదారుడి నుంచి ఆ ప్రాంత కౌన్సిలరు 15 శాతం డిమాండ్ చేశాడు. దాంతో ఆయన పనులు చేయకుండా వెళ్లిపోయారు.

బినామీలతో..

పరకాల పట్టణంలో ఆరుగురు గుత్తేదారులున్నారు. వీరిలో కౌన్సిలర్ల బినామీలున్నారు. అభివృద్ధి పనుల నిధుల్లోంచి పాలకవర్గానికి, అధికార యంత్రాంగానికి 8 నుంచి 9 శాతం ఇవ్వాల్సిందే. టెండర్లు, పనుల కేటాయింపులో ఓ కౌన్సిలర్ భర్త కీలకంగా వ్యవహరిస్తున్నారు.

అందరికీ తలాకొంత..

పట్టణంలో 30 వార్డులున్నాయి. 65 మంది గుత్తేదారులుండగా 25 మంది పనులు చేస్తున్నారు. వీరు చేస్తున్న పనులు నుంచి పాలకవర్గానికి 4-5 శాతం ఇస్తున్నారు. అధికారయంత్రానికి మరో 5 శాతం ఇస్తున్నట్లు తెలిసింది. నర్సంపేట పట్టణం సర్వాపురం శ్మశానవాటిక నడకదారిలో టైల్స్ వేసే పనులకు పట్టణ ప్రగతిలో రూ.10 లక్షలు మంజూరయ్యాయి. నాసిరకంగా పనులు చేయిస్తున్నారు. 130 మీటర్ల నిడివితో ఉన్న నడకదారిలో మరుగుదొడ్ల వరకు టైల్స్ వేసి వదిలేశారు. దారికి రెండు వైపులా నిర్మించిన పక్క గోడలు (సైడ్ వాల్స్) వంకరగా ఉండడమేగాక అవి పలు చోట్ల పగుళ్లిచ్చాయి. పనులు పూర్తి కాకముందే పగుళ్లు వచ్చాయంటే పనులు ఎంత నాణ్యతగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. టైల్స్ వేయడం కూడా ఎత్తు పల్లాలుగా ఉంది. ఈ విషయమై పుర ఏఈ శాంతిస్వరూప్‌ను వివరణ కోరగా పనులు నిలిపి వేయించామని గోడలు పగుళ్ల వచ్చిన విషయం తెలియదని పరిశీలించి చర్యలు చేపడుతామన్నారు. మహబూబాబాద్ పట్టణం జగన్‌కాలనీలో నెలన్నర కిందట రూ.5 లక్షలతో ఈ సీసీ రోడ్డు నిర్మించారు. పదికాలాల పాటు మన్నికతో ఉండాల్సిన రోడ్డు కంకర తేలి పాత రోడ్డులా మారిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 9 పురపాలికల్లో కమీషన్ల పర్వం కొనసాగుతోంది. అందువల్లే అభివృద్ధి పనుల్లో నాణ్యతలోపాలు కనిపిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

నాణ్యత పరిశీలించాకే బిల్లులు చెల్లిస్తాం

కె.ప్రసన్నరాణి, కమిషనర్, మహబూబాబాద్‌పనుల్లో నాణ్యత పరిశీలించిన తర్వాతనే బిల్లులు చెల్లిస్తాం. గుత్తేదారులు పనులు ప్రారంభించే ముందు సమాచారం ఇస్తే వర్క్ ఇన్‌స్పెక్టర్ లేదా, ఏఈ దగ్గర ఉండి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తుంటారు.

# సర్పంచి లేని మేజర్ పంచాయతీ

మల్లాపూర్ : మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీకి నాలుగున్నరేళ్లుగా సర్పంచి ఎన్నిక నిర్వహించడం లేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో సర్పంచి ఎన్నికను నిర్వహించకుండా వార్డు సభ్యుల ఎన్నికను మాత్రమే నిర్వహించారు. రద్దు పరచిన సర్పంచి ఎన్నికను ఎన్నికల సంఘం నిర్వహించలేదు. దీంతో సర్పంచి లేకుండానే పదవీ కాలం ముగియనుంది. ప్రత్యేకాధికారి పాలనలో అభివృద్ధి పనులు లేక, సమస్యలు పరిష్కరించేవారు కానరాక మల్లాపూర్ గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కానరాని అభివృద్ధి..

మల్లాపూర్ మేజర్ పంచాయతీకి సర్పంచి లేకపోవడంతో అభివృద్ధిని పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగుతున్నప్పటికీ సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం ఎంపీవో జగదీష్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పంచాయతీలోని వార్డు సభ్యులతో మూడు నెలలకు ఓసారి సమావేశమవుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడంలేదు. అభివృద్ధి పనులు చేపట్టేం



దుకు అవసరమైన నిధులను సమీకరించకపోవడం, పంచాయతీలకు కేటాయిస్తున్న బడ్జెట్‌లో వీధి దీపాలు, పారిశుద్ధ్య చర్యలు మాత్రమే చేపడుతున్నారు. సీసీ రహదారులు, కాలువలు లేకపోవడంతో రహదారులపై మురుగు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మౌలిక వసతుల కొరత-రమేష్, వార్డు సభ్యుడు

మల్లాపూర్ మేజర్ పంచాయతీ అభివృద్ధికి అవసరమైన మేర నిధులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుంది. మల్లాపూర్ పంచాయతీకి 13వ ఆర్థిక సంఘం నుంచి ఏడాదికి దాదాపు రూ.30 లక్షలతోనే సర్దుకోవాల్సి వస్తుంది. పంచాయతీ పరిధిలో సీసీ రహదారులు, మురుగు కాలువల లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# లెక్కా పత్రం లేదు

సిరిసిల్ల : జిల్లాలోని పంచాయతీలు, పురపాలక సంఘాల్లో నిధుల వినియోగంలో ఇష్టారాజ్యం నెలకొంది. ఆడిట్‌లో ఎనిమిదేళ్లుగా వివిధ పథకాల కింద నిధుల వ్యయంలో అభ్యంతరాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. అయినా లెక్కా పత్రం చూపడం లేదు. 2021-22 ఆర్థిక సంవత్సరం ఆడిట్లో జిల్లాలోని 255 పంచాయతీలు, రెండు పురపాలికల్లో కలిపి రూ. 15.73 కోట్ల నిధుల వినియోగంలో లోపాలను గుర్తించారు. 2014-15 నుంచి ఇదే పరిస్థితి. అభ్యంతరాలకు వివరణలు ఇవ్వాలని ఆడిట్ అధికారులు లేఖలు రాసినా ఎలాంటి స్పందన ఉండటం లేదు. ఇటీవల జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి నెల రోజుల్లో నిధుల వ్యయంపై సరైన లెక్కలు చూపించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం గమనార్హం. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలక సంఘాలున్నాయి. వీటిలో చేపట్టే పనులకు పాలకవర్గాల తీర్మానాల మేరకు నిధులు వెచ్చించాలి. ప్రతి ఖర్చుకు బిల్లులు జత చేయాలి. కొన్ని పథకాల నిధుల్లో అయితే వాటికి లెక్క చూపలేదు. 2019లో పురపాలికల పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. ప్రత్యేకాధికారుల పాలన కొనసాగింది. అధికారులు ఇతర పనుల్లో నిమగ్నమై ఉండగా,



ఇక్కడ మాత్రం రాజకీయ పలుకుబడితో కిందిస్థాయి అధికారులు నిధులు పక్కదారి పట్టించారు. సిరిసిల్లలో 2014-15 నుంచి సరైన లెక్కలు చూపకపోగా కనీసం లేఖలకు స్పందన లేదు. వేములవాడలో తరచూ కమిషనర్లు బదిలీలు కావడం, ఇన్‌ఛార్జిలకు బాధ్యతలు అప్పగించడంతో ఆడిట్ అభ్యంతరాలపై దృష్టి సారించలేదు. జమా ఖర్చుల రికార్డుల నిర్వహణ లేకపోవడం, జీఎస్టీ, ఐటీ పన్నుల ఎగవేత, చేసిన పనులకు మించి అదనపు చెల్లింపులు, నిధుల దుర్వినియోగం వంటివి ఉన్నాయి. ఎనిమిదేళ్లలో రెండు పురపాలికలు కలిపి రూ. 37.36 కోట్ల ఖర్చులకు లెక్కలు చూపాల్సి ఉంది.

పంచాయతీల్లోనూ...

ప్రభుత్వం పల్లె ప్రగతిలో పంచాయతీలకు భారీగా నిధులు కేటాయిస్తోంది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.108 కోట్లు వచ్చాయి. వీటిని ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు నిర్దేశిత పద్దుల కింద ఖర్చు పెట్టాలి. కానీ పల్లెల్లో అభివృద్ధి, నిర్వహణ పేరున లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ఒక పద్ధతి అంటూ ఏమీ లేదు. రూ.500 పైన ఎలాంటి చెల్లింపులు జరిపినా చెక్కుల రూపంలో చేయాలని కొత్త పంచాయతీరాజ్ చట్టంలో సూచించారు. దీనిని పట్టించుకోకుండా వేలల్లో బిల్లులు నగదు రూపంలో చెల్లించినట్లు గుర్తించారు. పన్నుల డిమాండ్, వసూలు వివరాలను ప్రత్యేక రిజిస్టరులో రాయాలి. ఇవి సరిగా లేక నిధులు పక్కదారి పడుతున్నాయి. గ్రామ సభల్లో అభ్యంతరాలు వస్తున్నా పాలకవర్గం పట్టించుకోవడం లేదు. ఎనిమిదేళ్లలో రూ. 23.83 కోట్లకు పైగా నిధుల వ్యయానికి లెక్కా పత్రం లేదు.

నోటీసులు జారీ చేస్తున్నాం

- స్వప్న, జిల్లా ఆడిట్ అధికారి

ఆడిట్ తర్వాత అభ్యంతరాలపై పంచాయతీలు, పురపాలక సంఘాలకు నోటీసులు జారీ చేస్తున్నాం. వాటికి నిర్దేశిత సమయంలో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అభ్యంతరాలన్నింటిని నిధుల దుర్వినియోగం కింద పరిగణించాల్సిన అవసరం లేదు. కొన్ని నిబంధనలకు విరుద్ధంగా వ్యయం చేసినవి ఉంటాయి. వాటిని పరిష్కరించుకోవాల్సిన బాధ్యత కమిషనర్లు, పంచాయతీల్లో కార్యదర్శులకు ఉంటుంది.




## మద్యం కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి: మద్యం కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ సోమవారానికి వాయిదా పడింది. ఈ కేసులో ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్, చంద్రబాబు తరఫున నాగముత్తు, దమ్మాలపాటి శ్రీనివాస్ గురువారం వాదనలు వినిపించారు. ప్రివిలేజ్ ఫీజు రద్దు చేయాలని ఎక్సైజ్ కమిషనర్ ప్రతిపాదన పంపారని, కమిషనర్ ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించిందని న్యాయవాది నాగముత్తు కోర్టుకు తెలిపారు. ఫైల్‌పై అప్పటి రెవెన్యూ స్పెషల్ సీఎస్ సంతకాలు చేశారని వివరించారు.

ప్రివిలేజ్ ఫీజు రద్దు చంద్రబాబు వ్యక్తిగత నిర్ణయం కాదని పేర్కొన్నారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 27కి వాయిదా వేసింది.

## ఎప్పుడు డీఎస్సీ... ఇంకెప్పుడు నోటిఫికేషన్ జగనన్న..



విశాఖపట్నం: నెలలు గడిచిపోతున్నా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయడం లేదంటూ వైసీపీ సర్కారుపై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విరుచుకుపడ్డారు. "ఎప్పుడు డీఎస్సీ... ఇంకెప్పుడు నోటిఫికేషన్ జగనన్న. మన రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్.. 'మళ్లీ మళ్లీ పెళ్లి' డైలాగును తలపిస్తోంది. అదిగో డీఎస్సీ... ఇదిగో డీఎస్సీ.... అంటూ విద్యాశాఖ మంత్రి గారు మీడియా ముందు గొప్పలు... ఆ తర్వాత ఆ ఊసే ఉండదు. మొన్నటికి మొన్న వారంలో డీఎస్సీ నోటిఫికేషన్ అన్నారు. ఆ వారాలన్నీ దాటిపోయి నెలలు గడుస్తున్నాయి మంత్రిగారు. మెగా డీఎస్సీని కాస్త మినీ డీఎస్సీ చేశారు ఇప్పుడు దీనికి కూడా మోక్షం కలిగేలా లేదు. మంత్రి గారి మాటలు ' ఒట్టి విస్తరాకు మంచి నీళ్ళే' ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి నోటిఫికేషన్ల గారెడీతో నిరుద్యోగులను మరో మోసానికి తెర తీశారు తప్ప ఇంకోటి కాదు. ఎన్నికలకు ముందు రాష్ట్రంలో 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ అన్నారు...! ఆ తర్వాత ఏడాదికి ఒక డీఎస్సీ అన్నారు....! గిరిజన యువతకు ప్రత్యేక డీఎస్సీ అన్నారు..! మీకు అసలు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే ఆలోచన ఉందా..? లేఖ ఇది కూడా మీ మ్యానిఫెస్టోలో రాలిపోయే రత్నం గానే మిగిలిపోతుందా..? ఉద్యోగాల నియామక ప్రక్రియ ఆలస్యమయ్యేకొద్దీ కొందరు నిరుద్యోగులకు వయసు రీత్యా అనర్హులవుతున్నారనే సంగతి గాలికొదిలేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఉద్యోగం కోసం వేలాది మంది నిరుద్యోగులు రొడెక్కి. ఉద్యమాలు చేస్తున్న మీలో చలనం లేదు. నిరుద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దు జగన్మోహన్ రెడ్డి గారు. 2014లో... 9,061 పోస్టులతో, 2018లో... 7,729 పోస్టులతో మెగా డీఎస్సీలు ప్రకటించి వేలాది మంది నిరుద్యోగుల కుటుంబాలలో వెలుగులు నింపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. రాష్ట్రంలోని నిరుద్యోగులు ముఖ్యంగా డీఎస్సీ అభ్యర్థులు అధైర్య పడాల్సిన అవసరం లేదు. 2024లో రానున్నది చంద్రన్న పాలనే. రాష్ట్రంలో అన్ని శాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసి మళ్ళీ మీ కుటుంబాలలో వెలుగులు నింపేది కూడా చంద్రన్న ప్రభుత్వమే" అని మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు.

## 24న రూ.300ల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటా విడుదల: తితిదే



తిరుమల: 2024 ఫిబ్రవరి నెలకు సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను నవంబరు 24న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్టు తితిదే గురువారం తెలిపింది. తిరుమల, తిరుపతిలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో ముందస్తుగా దర్శన టికెట్లు, గదులను బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు విజ్ఞప్తి చేశారు.

**నవంబరు 27న శ్రీవారి సేవ టికెట్లు విడుదల :** 2024 ఫిబ్రవరి 16న రథసప్తమి పర్వదినానికి సంబంధించి శ్రీవారి సేవ స్లాట్లను నవంబరు 27న ఉదయం 10గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 18 నుంచి 50 ఏళ్ల వరకు వయోపరిమితి ఉన్నవారు మాత్రమే ఈ స్లాట్లను బుక్ చేసుకునేందుకు అర్హులు. తిరుమల, తిరుపతిలో భక్తులు స్వచ్ఛందసేవ చేసేందుకు జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి శ్రీవారి సేవ, నవనీత సేవ కోటాను నవంబరు 27న మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు పరకామణి సేవ కోటాను తితిదే విడుదల చేయనుంది. ఈ సేవలను www.tirumala.org వెబ్‌సైట్‌లో భక్తులు బుక్ చేసుకోవచ్చని తితిదే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.



## పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నియామకాల భర్తీపై హైకోర్టుకు ప్రభుత్వం అప్పీల్

అమరావతి: పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నియామకాల భర్తీకి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం సింగిల్ జడ్జి స్టే విధించడంతో డివిజన్ బెంజ్‌కి ఏపీ ప్రభుత్వం అప్పీల్ చేసింది. ఎంతో పారదర్శకంగా నియామకాలు చేపట్టినా ఫలితాలపై స్టే విధించడం న్యాయబద్ధం కాదని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. 2019లో ఎత్తు విషయంలో అర్హత సాధించిన వేళాది మంది అభ్యర్థులు 2023లో అనర్హత సాధించడంపై హైకోర్టును అభ్యర్థులు ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం తుది ఫలితాలపై రాష్ట్ర న్యాయస్థానం సింగిల్ జడ్జి స్టే విధించారు. ఈ అప్పీల్‌ని అత్యవసరంగా విచారించాలని అభ్యర్థించింది. వేళాదిమంది విద్యార్థుల భవిష్యత్తుపై ఆధారపడి ఉన్న ఈ నియామకాలపై తక్షణమే స్టే ఎత్తివేయాలని ప్రభుత్వం ధర్మాసనానికి అప్పీల్ చేసింది. ఈ పిటిషన్‌పై రేపు వాదనలు జరిగే అవకాశం ఉంది. పిటీషనర్ల తరఫున ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ వాదనలు వినిపించనున్నారు.

## సుప్రీం కోర్టు తొలి మహిళా న్యాయమూర్తి కన్నుమూత

తిరువనంతపురం: సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి జస్టిస్ ఫాతిమా బీవి (96) కన్నుమూశారు. కేరళలోని కొల్లాంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఆమె తుదిశ్వాస విడిచారు. గతంలో ఆమె తమిళనాడు గవర్నర్‌గా కూడా పనిచేశారు. ఆమె మృతిపట్ల కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ సంతాపం తెలియజేశారు. తొలి మహిళా సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఫాతిమా బీవి చరిత్ర సృష్టించారని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జస్టిస్ ఫాతిమా బీవి.. 1927, ఏప్రిల్ 30న కేరళలోని పతనంతిట్టలో జన్మించారు. తండ్రి ప్రోత్సాహంతో ఆమె న్యాయవాద విద్య అభ్యసించారు. 1950లో కేరళ బార్ కౌన్సిల్ పరీక్షలో గోల్డ్ మెడల్ సాధించిన తొలి మహిళగా రికార్డు నెలకొల్పారు. అనంతరం 1974లో జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 1980లో ఇన్‌కమ్‌ట్యాక్స్ అప్పిలేట్ ట్రెబ్యునల్‌లో జ్యుడిషియల్ సభ్యురాలిగా నియమితులయ్యారు. 1983 నుంచి 1989 వరకు హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. అనంతరం 1989 అక్టోబరు 6 నుంచి 1992 ఏప్రిల్ 29 వరకు సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. 1997లో అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ ఆమెను తమిళనాడు గవర్నర్‌గా నియమించారు.




ఢిల్లీ: దేశంలో అలజడి సృష్టిస్తున్న డీప్‌ఫేక్ వీడియోల వ్యాప్తి కట్టడికి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో దీనిపై కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకురానున్నట్లు కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించే వారికి, ఆ వీడియోల వ్యాప్తికి కారణమయ్యే సామాజిక మాధ్యమాలకు భారీ జరిమానా విధించే యోచనలో ఉన్నట్లు తెలిపారు. డీప్‌ఫేక్ వీడియోల కట్టడిపై చర్చించేందుకు కేంద్రం కీలక సమావేశం నిర్వహించింది. సామాజిక మాధ్యమ సంస్థలు, నాస్కామ్, కృత్రిమ మేధపై పనిచేసే నిపుణులతో చర్చించింది. ఈ సమావేశం అనంతరం కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాతో మాట్లాడారు. మన ప్రజాస్వామ్యానికి డీప్‌ఫేక్ సరికొత్త ముప్పుగా పరిణమించిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని కట్టడి చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "సామాజిక మాధ్యమ సంస్థలతో జరిగిన సమావేశంలో మేం నాలుగు అంశాలపై కీలకంగా చర్చించాం. డీప్‌ఫేక్‌లను గుర్తించడం, వాటి వ్యాప్తిని అరికట్టడం, వాటిని నివేదించడం, అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చలు జరిపాం. రాబోయే కొన్ని వారాల్లో దీనికి సంబంధించి కొత్త నిబంధనలు తీసుకురాబోతున్నాం. ఆ ముసాయిదా రూపకల్పనను నేటి నుంచే ప్రారంభిస్తాం. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను సవరించడమో.. లేకపోతే కొత్త చట్టం తీసుకురావడమో చేస్తాం" అని కేంద్రమంత్రి వెల్లడించారు. డిసెంబరు తొలి వారంలో దీనిపై మరోసారి చర్చిస్తామన్నారు. ఇటీవల సినీతారలు రష్మిక, కాజోల్, కత్రినాకైఫ్, సచిన్ కుమార్తె సారా సహా పలువురు సెలబ్రిటీల డీప్‌ఫేక్ వీడియోలు వైరల్ అయిన విషయం తెలిసిందే. దీంతో టెక్నాలజీ దుర్వినియోగంపై పలువురు ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. అటు ప్రధాని మోదీ కూడా దీనిపై తీవ్రంగా స్పందించారు. డీప్‌ఫేక్‌లు సమస్యాత్మకంగా మారుతున్నాయని అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని మీడియాను కోరారు. ఈ నేపథ్యంలోనే చర్యలకు సిద్ధమైన కేంద్రం నేడు సామాజిక మాధ్యమ సంస్థలతో సమావేశమైంది.




## విశాఖలో కొనసాగుతున్న తవ్వకాలు

విశాఖపట్నం: విశాఖ కైలాసగిరి కొండ దిగువన తవ్వకాలపై ఏపీ హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. కొండతొలిచే పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీఎంఆర్‌డీఏ తీరుపై జనసేన కార్పొరేటర్ మూర్తి మండిపడ్డారు. హైకోర్టు ఉత్తర్వులను అధికారులు బేఖాతరు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు బుధవారం స్టేటస్ కో ఆదేశాలివ్వగా.. రాత్రి నుంచి పనులు మరింత ముమ్మరమయ్యాయి. జేసీబీతో మట్టిని తవ్వేస్తున్నారు. తెన్నేటి పార్క్.. పార్కింగ్ కోసం కొండను తవ్వుతున్నట్టు దాఖలైన పిటిషన్‌పై బుధవారం ఏపీ హైకోర్టు విచారణ జరిపిన సంగతి తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా కొండను తవ్వి పార్క్ కోసం నిర్మాణం చేపట్టారని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం అక్రమ నిర్మాణాలు చేపడుతోందని పిటిషనర్ తరఫు న్యాయవాది కేఎస్ మూర్తి కోర్టుకు తెలిపారు. దీనిపై కౌంటరు దాఖలు చేయాలని విశాఖ మున్సిపల్ అధికారులకు హైకోర్టు ఆదేశాలిచ్చింది. అప్పటి వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను హైకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.


## జీవీయల్ వ్యాఖ్యలపై సిపిఐ నేత రామకృష్ణ ఏమన్నారంటే..




విజయవాడ: బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు చేసిన వ్యాఖ్యలపై సీపీఐ నేత రామకృష్ణ కౌంటర్ ఇచ్చారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ రెండు పెద్ద పార్టీలే కానీ ఆంధ్రప్రదేశ్‌లో నెగటివ్ ఓట్లలో పెద్ద పార్టీ బీజేపీయేనని అన్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు అరెస్టు విషయంలో బీజేపీ, జగన్ కలిసే జైలుకు పంపారని విమర్శించారు. బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఇదివరకే చెప్పాం.. ఢిల్లీలో మీరు చేస్తుందేంటి.. ఢిల్లీ ఉపముఖ్యమంత్రి 6 నెలలుగా జైలులో ఉన్నారని.. ఎమ్మెల్సీ కవిత, విజయసాయి అల్లుడు అదే కేసులో బయట ఉన్నారని, బీజేపీ మద్దతు లేకపోతే బయట ఉంటారా? అని ప్రశ్నించారు. బీజేపీ కూడా ఒకానొక సమయంలో ఇద్దరు ఎంపీలు మాత్రమే ఉన్నారని, తమకు ఇప్పుడు ఇద్దరే ఉన్నారని రామకృష్ణ వ్యాఖ్యానించారు. అయినా మేము ప్రజల తరుపున నిలబడి పోరాడతామని, ప్రజలు తలుచుకుంటే ఎవరినైనా గెలిపిస్తారని అన్నారు. ఎంతో మంది ఆంధ్రులు కమ్యూనిస్టులుగా ఆత్మగౌరవం కోసం పోరాడారని, మీలాంటి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు భయపడమని రామకృష్ణ స్పష్టం చేశారు. ఏపీలో జనసేనతో పొత్తుపై బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కీలక వ్యాఖ్యలు చేశారు. "జనసేన, బీజేపీ బంధంపై ఎలక్షన్లు దగ్గరపడే కొద్దీ మరింత స్పష్టత వస్తుంది. మరెవరినైనా కలుపుకోవాలా అనే దానిపై భవిష్యత్తులో చర్చిస్తాం. జనసేన పొత్తుపై మాకెలాంటి కన్ఫ్యూజన్ లేదు. 175 నియోజకవర్గాలల్లో డిసెంబర్ నుంచి మా పార్టీ బలోపేతం అవడానికి పని చేస్తుంది. ఏపీ అధ్యక్షులు ఎవరైనా మా పార్టీ అభివృద్ధికే నిర్ణయాలుంటాయి. తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఓడించగల పార్టీగా బీజేపీ ఉంది. ఇండియా అలయెన్స్‌లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అన్ని చోట్ల పోటీ చేస్తోంది.


అందరూ కలిసొచ్చినా, విడివిడిగా వచ్చినా, ఇంకో నలుగురిని తెచ్చుకున్నా మోదీదే గెలుపు. బీజేపీపై ఏ పార్టీ వ్యాఖ్యలు చేసినా వారిది అభద్రతా భావమే. కమ్యూనిస్టులు దిక్కు తోచక ప్రధాని మోదీపై అనేక ఏడుపుకొట్టు మాటలు మాట్లాడుతున్నారు. కమ్యూనిస్టులు దాదాపు కనుమరుగయ్యారు.. తెలంగాణాలో ఒకటో రెండో సీట్లు పొందారు. ఏపీలో కూడా సీట్లు కోసం కమ్యూనిస్టులు ఇలా మాట్లాడుతున్నారు" అని ఎంపీ జీవీఎల్ ఎద్దేవ చేశారు.

## మాది పిట్టల పార్టీ అయితే.. వారిది రాబందుల పార్టీ



విజయవాడ : బీజేపీ సీనియర్ నేత జీవియల్ వ్యాఖ్యలకు సీపీఎం నేత బీవీ రాఘవులు కౌంటర్ ఇచ్చారు. పిట్టలంటే అందరికీ గౌరవమని.. మమ్మల్ని పిట్టలతో పోల్చినందుకు జీవియల్ ధన్యవాదాలు తెలిపారు. పిట్టలు లేకుంటే అసలు పర్యావరణమే లేదనేది వారు తెలుసుకోవాలన్నారు. తాము పిట్టల పార్టీల వాళ్లమే అయితే.. వారిది రాబందుల పార్టీ కదా అని అన్నారు. తాము ప్రజల కోసం పని చేస్తామని.. వారు పెట్టుబడిదారుల కోసం పని చేస్తారన్నారు. సమాజాన్ని నాశనం చేయడానికే ఆ రాబంధులు పని చేస్తున్నారని బీవీ రాఘవులు మండిపడ్డారు. మా వల్ల ప్రజలకు మేలు జరిగితే.. వాళ్ల వల్ల అన్యాయం జరుగుతోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా బండి సంజయ్‌ను తొలగించి, కిషన్ రెడ్డిని ఎందుకు పెట్టారని బీవీ రాఘవులు ప్రశ్నించారు. కర్నాటక, ఇతర రాష్ట్రాలలో వాళ్ల పార్టీ నాయకులను ఎందుకు మార్చారని నిలదీశారు. వాళ్ల సంగతి వాళ్లు తెలుసుకుని ప్రజల ఆదరణ పొందితే మేలని అన్నారు. వైరుధ్యాలు ఉన్నా అనేక పార్టీలు కలిసి ఇండియాగా ఏర్పడ్డాయన్నారు. మతోన్మాదాన్ని తరిమికొట్టేందుకు ఇండియా పని చేస్తోందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీని ఓడించేలా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. సీపీఐ, సీపీఎంలు శాసన సభకు వెళ్లాలని ఎవరికి వారుగా పోటీ చేస్తున్నామని బీవీ రాఘవులు తెలిపారు.

## మేఘాకు గ్యారెంటీ పచ్చి అబద్ధం: మంత్రి బుగ్గన



అమరావతి: టీడీపీ.. దోపిడీ గురించి మాట్లాడటం గజదొంగే.. దొంగ, దొంగ అని అరిచినట్లుందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ, మేఘా సంస్థకు ప్రభుత్వ గ్యారెంటీ ఆరోపణ ముమ్మాటికీ అబద్ధమన్నారు. రుణానికి సంబంధించిన పూర్తి బాధ్యత మేఘా సంస్థదే. ప్రభుత్వానికి సంబంధం లేదు" అని మంత్రి స్పష్టం చేశారు. "ఆరోగ్యశ్రీపై టీడీపీ వెచ్చించింది రూ.5,177 కోట్లు మాత్రమే. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ.9,514.84 కోట్లు. చంద్రబాబు కళ్లల్లో పడటం కోసం ఓ వ్యక్తి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అర్థంలేని ఆరోపణలతో విమర్శిస్తున్నారు. మేఘా కంపెనీ ప్రభుత్వ గ్యారెంటీతో రూ. 2000 కోట్లు అప్పు తెచ్చుకుందని అర్థం లేకుండా ఆరోపించారు.

దోచుకోవడానికే ఇలా చేశారని వితండవాదం చేశారు. గ్యారంటీ లెటర్ అంటే ఏంటో మీకు కనీస అవగాహన లేదు" అంటూ మంత్రి బుగ్గన మండిపడ్డారు. "ఈ విషయం తప్పు కాదనే ఆర్థిక అంశాలలో అవగాహన ఉన్న మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల ఎందుకు మాట్లాడడం లేదు.?. ఏ పనీ చేయకుండా ఏదో చేస్తున్నామనేలా హైప్ చేసి స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ.241 కోట్లు దోచుకుందెవరు?. రాజధాని అమరావతి పేరుతో వేల కోట్లు సంపాదించిందెవరు?. ఇన్నర్ రింగ్‌రోడ్డును మెలికలు తిప్పి అక్రమాలకు పాల్పడిందెవరు?. సామాన్య ప్రజలలో మా ప్రభుత్వ సంక్షేమ విధానాలు, పరిపాలన మీద ఉన్న అభిమానాన్ని, నమ్మకాన్ని దెబ్బతీయాలనే కుట్ర చేస్తున్నారు. అందుకే ప్రైవేట్ సంస్థకు ప్రభుత్వ గ్యారంటీ అని మా మీద బురద చల్లుతున్నారని ప్రజలకు అర్థం అయింది" అని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

## లాక్మే వీక్‌ని షేక్ చేసిన కియరా

జెన్ Z స్టార్లలో ఒకరైన కియారా అద్వానీ తన నటనతోనే కాకుండా మంత్రముగ్ధులను చేసే రూపంతోను యువతరంలో పాపులరైంది. అతి తక్కువ వ్యవధిలో హిందీ సినిమాల్లో భారీ విజయాన్ని అందుకున్న నటిగా కియరా పేరు మార్మోగుతోంది. అగ్ర దర్శకనిర్మాతలకు కియరా ఒక కీలక ఆప్షన్ గా నిలిచింది. కియారా ప్రస్తుతం ముంబైలో కొనసాగుతున్న లాక్మే ఫ్యాషన్ వీక్ 2023లో కనిపించి షో స్టాపర్ గా నిలిచింది. ఈవెంట్ 4వ రోజున, కియారా ఫల్గుణి షేన్ పీకాక్‌కి షోస్టాపర్‌గా కనిపించింది. ర్యాంప్ పై నలుపు-బంగారు రంగులో ఉన్న బాడీకాన్ గౌనును ధరించి క్యాట్ వాక్ చేసింది. లాక్మే ఫ్యాషన్ వీక్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ కియరా ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది. నెటిజనులు కియరా స్టన్నింగ్ లుక్ కి స్పెల్ బౌండ్ అయిపోవడం విశేషం. కియారా ఫల్గుణి షేన్



పీకాక్ కోసం ర్యాంప్ వాక్ చేయడం ఇదే మొదటిసారి కాదు. ఈ సంవత్సరం జూలైలో, ఇండియా కోచర్ వీక్ 2023లో షోస్టాపర్‌గా కనిపించారు. స్టన్నింగ్ కియరా స్టైలిష్ లుక్స్ .. అందంగా డిజైన్ చేసిన దుస్తులతో ర్యాంప్‌ను అలంకరించిన కియరా యూత్ హార్ట్ త్రోబ్ గా మారింది. ఇప్పుడు లాక్మే వీక్ లోను ఎంతో స్పెషల్ లుక్ తో ఆకట్టుకుంది. వ్యక్తిగతంగా కియరా తన ప్రియుడు, హీరో సిద్ధార్థ్ మల్హోత్రాని పెళ్లాడిన సంగతి తెలిసిందే. వృత్తిరీత్యా 31 ఏళ్ల కియరా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. కార్తీక్ ఆర్యన్‌తో కలిసి సత్యప్రేమ్ కి కథలో చివరిగా కనిపించిన ఈ బ్యూటీ మరో రూ.100 కోట్ల క్లబ్ సినిమాని తన ఖాతాలో వేసుకుంది. ఈ చిత్రం కమర్షియల్ హిట్‌గా నిలిచింది. తదుపరి రామ్ చరణ్ సరసన శంకర్ దర్శకత్వంలో గేమ్ ఛేంజర్ అనే పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ లో నటిస్తోంది. ఇందులో ఎస్ జె సూర్య, జయరామ్, సునీల్, శ్రీకాంత్, సముద్రఖని సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. ఇది 2025లో సినిమా థియేటర్లలో విడుదల కానుంది. జూనియర్ ఎన్టీఆర్ - హృతిక్ రోషన్-స్టార్ వార్ 2 లో కూడా కియరా కాథానాయికగా నటించనుంది.

## బ్లాక్ ఫ్రాక్ లో ఈషారెబ్బ కిర్రాక్

లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టి తరువాత అంతకుముందు ఆ తరువాత సినిమా ద్వారా హీరోయిన్ గా మొదటి సక్సెస్ అందుకున్న అందాల భామ ఈషారెబ్బ. నటిగా ఈ బ్యూటీ తాను చేసిన ప్రతి సినిమాతో మంచి మార్కులే వేసుకుంది. గ్లామర్ పరంగా కూడా చాలా మంది హీరోయిన్స్ కంటే బెస్ట్ గా ఉంటుంది. అయిన కాని ఈ అమ్మడుకి అదృష్టం కలిసి రావడం లేదని చెప్పాలి. కెరియర్ లో ఎక్కువగా చిన్న సినిమాలలోనే నటిస్తూ వస్తోన్న ఈషారెబ్బకి చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్ హిట్స్ అయితే ఏమీ లేవు. మొదటి సినిమా తర్వాత అమీతుమీ సినిమాతో మరో హిట్ అందుకుంది. అలాగే బ్రాండ్ బాబు కూడా పరవాలేదనిపించుకుంది. రీసెంట్ గా



సుధీర్ బాబు మామా మశ్చీంద్ర మూవీతో ఈ అమ్మడు హీరోయిన్ గా ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. డిజిటల్ లో కూడా అడుగుపెట్టిన ఈషారెబ్బ మాయాబజార్ ఫర్ సేల్, జేడీ చక్రవర్తి దయా వెబ్ సిరీస్ లతో సక్సెస్ అందుకుంది. ఓ వైపు సినిమాలు, మరో వైపు వెబ్ సిరీస్ లు చేస్తూ కెరియర్ ని స్ట్రాంగ్ గా బిల్డ్ చేసుకునే పనిలో ఈషారెబ్బ ఉంది. ఇదిలా ఉంటే ఈ బ్యూటీ నటిగా ఎంత గుర్తింపు వచ్చిందో అంతకు మించి పాపులారిటీ సోషల్ మీడియా ద్వారా తెచ్చుకుంటుంది. రెగ్యులర్ గా తన ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ ఫోటోషూట్ లని షేర్ చేస్తూ ఫ్యాన్స్ కి కావాల్సినంత వినోదం ఈషా రెబ్బ అందిస్తూ ఉంటుంది. హాట్ హాట్ భంగిమలతో ఫోటోలకి ఫోజులు ఇస్తూ కుర్రకారు హృదయాల్ని కొల్లగొడుతూ ఉంటుంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతాయి. తాజాగా ఈషా రెబ్బ వెకేషన్ లో లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. ఈ సందర్భంగా ఈ అమ్మడు బ్లాక్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో అందాలు చూపిస్తూ కుర్రాళ్ళకి హీట్ పెంచేస్తోంది. కరెక్ట్ గా వినియోగించుకుంటే ఈషారెబ్బ అందాలకి ఈపాటికే స్టార్ హీరోయిన్ అయిపోయేదనే మాట ఈమె ఫోటోలు చూస్తున్న నెటిజన్లు నుంచి వినిపిస్తోంది. ఈ పిక్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.




## డుంకీతో జాక్ పాట్ కొడతారా?




షారుఖ్ ఖాన్, తాప్సీ లీడ్ రోల్ లో రాజ్ కుమార్ హిరాణీ దర్శకత్వంలో తెరకెక్కి ప్రేక్షకుల ముందుకి రావడానికి సిద్ధం అవుతోన్న సినిమా డుంకీ. డిసెంబర్ 21న ఈ మూవీ థియేటర్స్ లోకి అడుగుపెడుతోంది. సలార్ కి పోటీగా వస్తోన్న కూడా నిర్మాతలు ఎలాంటి టెన్షన్ లేకుండా మూవీ రిలీజ్ కి రెడీ అవుతున్నారు. దీనికి కారణం షారుఖ్ ఇమేజ్, మార్కెట్ మీద ఉన్న నమ్మకమని చెప్పాలి. బాలీవుడ్ లోకి వెళ్ళిన చాలా రోజులకి తాప్సికి ఒక పెద్ద సినిమాలో నటించే అవకాశం డుంకీతో వచ్చింది. ఇందులో పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉన్న పాత్రలోనే ఆమె కనిపిస్తోంది. రాజ్ కుమార్ హిరాణీ సినిమాలు అంటే యాక్షన్ ఎలిమెంట్స్ అస్సలు ఎక్స్ పెక్ట్ చేయాల్సిన అవసరం లేదు. బలమైన కథ, కథనం, మానవ సంబంధాలు, సోషల్ సెటైరికల్ ఎక్కువగా ఉంటాయి. డుంకీలో కూడా అలాంటి అంశాలని రాజ్ కుమార్ హిరాణీ టచ్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ సినిమా బడ్జెట్ కూడా రాజ్ కుమార్, షారుఖ్ ఖాన్ రెమ్యునరేషన్ కాకుండా వంద కోట్లలోనే అయ్యిందంట. అంతే తక్కువ బడ్జెట్ లో మూవీ పూర్తి చేసినట్లే అని చెప్పాలి. అలాగే షూటింగ్ కోసం ఎక్కువ టైం తీసుకోలేదు. ఈ మూవీకి నాన్ థియాట్రికల్ రైట్స్ ద్వారానే 250 కోట్ల ఆదాయం వచ్చేసిందని బిటౌన్ లో వినిపిస్తోన్న మాట. ఈ రైట్స్ ద్వారానే సినిమాకి పెట్టిన పెట్టుబడి మెజారిటీ రికవరీ అయిపొయింది. ఇక థియాట్రికల్ బిజినెస్ కూడా గట్టిగానే జరిగే అవకాశం ఉంది. హిందీతో పాటు సౌత్ భాషలలో కూడా రిలీజ్ చేస్తే భారీ కలెక్షన్స్ కొల్లగొట్టే అవకాశం ఉంది. ఈ సినిమా హిట్ అయితే షారుఖ్ ఖాతాలో మరో వెయ్యి కోట్ల కలెక్షన్ మూవీగా మారిపోతుంది.

ఈ స్థాయిలో కలెక్షన్స్ వస్తే మాత్రం 600 కోట్లకి పైగా షేర్ అందుకునే ఛాన్స్ ఉందని టాక్. నిర్మాతకి అయితే ఈ మూవీ భారీ లాభాలు తెచ్చిపెడుతుందని, షారుఖ్ ఖాన్, రాజ్ కుమార్ హిరాణీ కాంబో కచ్చితంగా ఈ ఏడాదిలో డుంకీతో జాప్ పాట్ కొత్తబోతున్నారు అంటూ ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోన్న మాట. పాజిటివ్ టాక్ వచ్చిన కూడా సలార్ మూవీ టాక్ కూడా డుంకీ కలెక్షన్స్ ని డిసైడ్ చేసే ఛాన్స్ ఉందని సినీ విశ్లేషకుల అభిప్రాయం.

## మరీ అంత క్యూట్ గా మూతి పెడితే ఎలా బొల్లమ్మ!



తెలుగు ప్రేక్షకులకు సమంత, శర్వానంద్ జంటగా నటించిన 'జాను' సినిమా తో జానుగా మారిపోయిన ముద్దుగుమ్మ వర్ష బొల్లమ్మ. ఆ సినిమాలో ఈ అమ్మడిది చిన్న పాత్రే అయినా కూడా చాలా మంది దృష్టిని ఆకర్షించింది. అప్పటి నుంచి కూడా ఈ అమ్మడికి వరుసగా తెలుగు సినిమా ఇండస్ట్రీలో క్రేజీ సినిమాల్లో నటించే ఆఫర్లు వస్తున్న విషయం తెల్సిందే. టాలీవుడ్ లో కమర్షియల్ హీరోయిన్ గా గుర్తింపు దక్కించుకోవాలి అంటే అందాల ఆరబోత తప్పనిసరి. కానీ ఈ అమ్మడు పెద్దగా స్కిన్ షో చేయకుండానే సింపుల్ గా, క్యూట్ అండ్ స్వీట్ గా చీర కట్టు మరియు సాంప్రదాయ డ్రెస్ ల్లో కనిపిస్తూ కూడా కవ్విస్తూ అలరిస్తోంది. అందుకే టాలీవుడ్ లో ఈ అమ్మడికి వరుసగా ఆఫర్లు వస్తున్నాయని మీడియా వర్గాల వారి టాక్. తమిళ్ సినీ ఇండస్ట్రీ లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా టాలీవుడ్ లో వచ్చిన ప్రతి ఒక్క ఆఫర్ ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇక సోషల్ మీడియాలో హద్దులు దాటే విధంగా అందాల ఆరబోత అయితే చేయదు కానీ.. ఈ అమ్మడు షేర్ చేసే క్యూట్ అండ్ స్వీట్ ఫోటోలు రెగ్యులర్ గా అందరి దృష్టిని ఆకర్షిస్తూనే ఉంటాయి. తాజాగా మరోసారి తన కర్లీ హెయిర్ తో మూతి ముందుకు పెట్టి సెల్ఫీ తీసుకుంది. ప్రస్తుతం ఈ క్యూటీ సెల్ఫీ అందరి దృష్టిని ఆకర్షిస్తూ వైరల్ అవుతోంది. వర్ష బొల్లమ్మ ముందు ముందు టాలీవుడ్ లో మరింత బిజీ అవ్వాలి అని ఈ ఫోటోలోని ఆమె క్యూట్ నెస్ ను చూసి చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. ఇలా ముద్దు పెట్టినట్టుగా మూతి పెడితే కుర్రకారు ఏమైపోవాలి అమ్మడు అంటూ కొందరు నెటిజన్స్ ప్రశ్నిస్తున్నారు.

## నాభి సొగసును ఆరాంగా చూపించేస్తోంది!

పూనమ్ బజ్వా నిరంతర ఫోటోషూట్లు అంతర్జాలాన్ని షేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలి కాలంలో ఈ భామ రొటీన్ కి భిన్నంగా ట్రెండీ లుక్స్ తో కట్టి పడేస్తోంది. బికినీ..టూపీస్.. యోగా..జిమ్ముల్లో వర్కౌట్ వీడియోలు ఫోటోలతో కుర్ర కారుని హీటెక్కించే ఈ భామ పొట్టినిక్కరల్లో చెలరేగిపోవడం చూస్తున్నదే. తాజాగా అమ్మడు మరోసారి ఇన్ స్టా వేదికగా ఓ స్పెషల్ ఫోటోషూట్ ని షేర్ చేసింది. బ్లూటాప్, ఫ్లోరల్ బాటమ్ లో బజ్వా అదరగొట్టింది. ఫోటోషూట్ ఆద్యంతం రకరకాల భంగిమలతో ఫోజులిచ్చిన ఈ భామ తన నాభి అందాల్ని ఆరాంగా తెరపరిచింది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ ఇన్ స్టాలో వైరల్ గా మారింది. నాభి అందాలు..నడుము ఒంపు



సొంపుల ఎలివేషన్ మతులు చెడగొడుతోంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. పూనమ్ అందాలపై నెటిజనులు కామెంట్లు అంతే ఆసక్తికరం. ఇటీవల కాలంలో పూనమ్ అప్ డేట్ చూస్తుంటే ఇన్ స్టాలో యాక్టివ్ నెస్ ని స్పీడప్ చేసినట్లు కనిపిస్తోంది. ఏదో ఒక హాట్ ఫోటోషూట్ తో ఫ్యాన్స్ కి టచ్ లో ఉంటుంది. తాజాగా షేర్ చేసిన ఫోటోషూట్ లో పూనమ్ థైషోస్ మేకప్ లెస్ లుక్ పైనా రకరకాల కామెంట్లు పడిపోతున్నాయ్. పూనమ్ హాట్ గా ఉందంటూ పలువురు నెటిజనులు కామెంట్ చేసారు. పూనమ్ కెరీర్ మ్యాటర్ కి వస్తే ప్రస్తుతం మలాయళంలో పాతోన్ పాతమ్ నుట్టానుండ్ అనే ఒకే సినిమాలో నటిస్తోంది. ఇది చరిత్ర నేపథ్యంతో కూడిన సినిమా.

భారీ బడ్జెట్ తోనే తెరకెక్కిస్తున్నారు. తెలుగులో పూనమ్ మొదటి సినిమాతో నటిగా పరిచయమైంది. ఆ తర్వాత పరుగు , ఎన్టీఆర్ కథానాయకుడు చిత్రాల్లో నటించింది. అలాగే పలు మీడియం బడ్జెట్ సినిమాల్లోనూ నటించింది. కానీ ఇక్కడ అనుకున్నంత స్టార్ డమ్ చిక్కలేదు. దీంతో ఇతర భాషా చిత్రాలపై దృష్టి పెట్టింది. తమిళ్, కన్నడ భాషల్లోనూ కొన్ని సినిమాలు చేసింది. అయితే మాతృభాష హిందీలో మాత్రం ఇప్పటి వరకూ ఒక్క సినిమా కూడా చేయలేదు.

## జవాని పాప గండే అదిరేలా..

అందాల ఆరబోతతో కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంటుంది బాలీవుడ్ బ్యూటీ అలయ ఎఫ్. హద్దులు పక్కన పెట్టేసి పరువాలన్నీ ప్రదర్శిస్తూ రచ్చ చేస్తుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో మరోసారి నేక్డ్ డ్రెస్‌లో గ్లామర్ షో చేస్తూ రకరకాల భంగిమల్లో పోజులు ఇచ్చి సెగలు పుట్టించింది. 2020వ సంవత్సరం లో జవానీ జానేమాన్ చిత్రంతో సినీ రంగంలో అడుగు పెట్టింది అలయ ఎఫ్. ఈమె గురించి సినీ ప్రేక్షకులతో పాటు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా ఫాలో అయ్యేవారికి దాదాపుగా తెలిసే ఉంటుంది. మొదటి



సినిమాతోనే ఫిల్మ్ ఫేర్ అవార్డు సొంతం చేసుకున్న ఈ బ్యూటీ.. మ్యూజిక్ వీడియోలు, సినిమాల్లో నటిస్తుంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఎల్లె బ్యూటీ అవార్డ్స్‌లో సందడి చేసింది. అక్కడ నేక్డ్ డ్రెస్‌లో కనువిందు చేసి అందరి దృష్టినీ మరోసారి ఆకర్షించింది. కాస్టీ పెరల్స్‌తో చేసిన నెట్ టైప్ డ్రెస్ ధరించి అందాలను ఆరబోస్తూ రకరకాల భంగిమల్లో పోజులిచ్చింది. సైడ్ యాంగిల్, ఫ్రంట్, బ్యాక్, బెండింగ్ పొజిషన్స్‌లో పోజులు ఇచ్చింది. హైహీల్స్ ధరించి, ముత్యాల తో ధరించిన ఇయర్ రింగ్స్‌తో స్టైలిష్ బ్రైడెడ్ హైయిర్ స్టైల్? ఆకట్టుకుంది. బ్యూటీ మొత్తాన్ని కెమెరా ముందు పరిచింది. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు అందం అదిరిపోయిందంటూ హాట్ ఎమోజీలతో కామెంట్లు పెడుతున్నారు. ఇకపోతే ఈమెకు ఇన్ స్టా వేదికగా 1.67 మిలియన్ల మంతి ఫాలోవర్లు ఉన్నారు. ఈ హాట్ బ్యూటీ ఇప్పటి వరకు 671 పోస్టులను తన అభిమానులతో షేర్ చేసుకుంది. ఈమె అందాన్ని రోజూ చూసేందుకే చాలా మంది ఫాలో అవుతుంటారు. ఈ ముద్దుగుమ్మ పెట్టే ప్రతీ ఫోటోకు షేర్, లైక్, కామెంట్లతో ఎంకరేజ్ చేస్తుంటారు. చివరిసారిగా ఈ ముద్దుగుమ్మ.. ఆల్మోస్ట్ ప్యార్ విత్ డీజే మోహబత్, యూ టర్న్ సినిమాలతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం శ్రీ, బడే మియాన్ చోటా మియాన్, ఏక్ ఔర్ గజబ్ కహానీ చిత్రాల్లో నటిస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి.




మహేశ్వరం: కందుకూరులో మెడికల్ కళాశాల రావడానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి కృషే కారణమని సీఎం కేసీఆర్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో నాలాల అభివృద్ధి జరిగిందంటే దానికి కారణం ఆమేనని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు చూట్టూ త్వరలోనే పైప్‌లైన్ రాబోతోందని, అది అందుబాటులోకి వస్తే మహేశ్వరం ప్రజలకు తాగునీటి సమస్యే ఉండదని తెలిపారు. ఫాక్స్‌కాన్ పరిశ్రమతో లక్ష మంది యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. "కాంగ్రెస్ తీరు వంటలు చేసి పెట్టండి మేము వడ్డిస్తామన్న చందంగా ఉంది. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నందునే రాష్ట్రంలో సంపద పెరిగింది. రాష్ట్ర సంపదను భారాస పెంచితే.. దానిని తుంచడానికి కాంగ్రెస్ మళ్లీ కుయుక్తులు పన్నుతోంది. మళ్లీ అధికారంలోకి రాగానే అందరి పింఛన్ పెంచుతాం. ఓటు అనే బ్రహ్మాండమైన ఆయుధాన్ని జాగ్రత్తగా ఆలోచించి ఉపయోగించాలి. మీ ఓటు ఐదేళ్ల రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. అభ్యర్థిని, వాళ్ల వెనక ఉన్న పార్టీని దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలి" అని కేసీఆర్ పిలుపునిచ్చారు. " 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం. రైతుబంధు పథకాన్ని పుట్టించిందే కేసీఆర్, భారాస ప్రభుత్వం. రైతుబంధు లాంటి పథకాలతో వ్యవసాయదారుల కుటుంబాలు కళకళలాడుతున్నాయి.

రైతుబంధు దుబారా అని పీసీసీ మాజీ అధ్యక్షుడు చెబుతున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే రైతుబంధు ఎకరానికి రూ.16వేలు చేస్తాం. రైతులకు 24 గంటల విద్యుత్ వృథా అని పీసీసీ అధ్యక్షుడు చెబుతున్నారు. రైతులకు 3గంటల సరఫరా సరిపోతుందని ఆయన అంటున్నారు. ధరణి పోర్టల్‌ను తీసుకెళ్లి బంగాళాఖాతంలో వేసి.. భూమాత తెస్తామంటున్నారు. కాంగ్రెస్ తెచ్చేది భూమాత కాదు.. భూమేత" అని కేసీఆర్ ఎద్దేవా చేశారు. ప్రజల కోసం అనునిత్యం పని చేసే సబితా ఇంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.




హైదరాబాద్: తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ తెలిపారు. తొమ్మిదిన్నరేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానంపై హైదరాబాద్‌లోని హోటల్ కాకతీయలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తున్నామని, ఇందుకోసం రూ.37 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మిషన్ భగీరథను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని, దీని స్ఫూర్తితోనే కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ జల్ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ప్రాజెక్టుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు పెట్టడమే కాకుండా.. నాలుగేళ్లలో ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరాన్ని నిర్మించినట్లు మంత్రి కేటీఆర్ వివరించారు. కాలువలు తవ్వి పాలమూరు ఎత్తిపోతల పథకాన్నీ పూర్తి చేశామన్నారు. రాజకీయాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయవద్దని ఈ సందర్భంగా కేటీఆర్ కోరారు. కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు, 20 రిజర్వాయర్లు, 20 లిఫ్టులని చెప్పారు. ప్రాజెక్టుల్లో సమస్యలు రావడం సర్వసాధారణమని.. ప్రకాశం, ధవళేశ్వరం, కడెం జలాశయాల్లోనూ సమస్యలు వచ్చాయని తెలిపారు. సాగర్ కట్టిన తర్వాత కూడా లీకేజీ సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం శ్రీశైలం పంపులు కూడా నీట మునిగాయన్నారు.

## రఘునందన్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు: రేవంత్ రెడ్డి

దుబ్బాక: భాజపా నేత రఘునందన్‌రావుకు ఈ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. విజయభేరి యాత్రలో భాగంగా దుబ్బాకలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రఘునందన్‌పై విమర్శలు గుప్పించారు. "దుబ్బాక ఉప ఎన్నికలో భాజపా అభ్యర్థిని గెలిపించారు. గెలిచిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి దుబ్బాకను అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్రం సహకారంలో పారిశ్రామికవాడ, ప్రాజెక్టులు తీసుకొస్తామన్నారు.

మూడేళ్లు ఇయినా ఇప్పటికీ దుబ్బాక సమస్యలు తీరలేదు. ఈ ఎన్నికల్లో రఘునందర్‌రావుకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు. దుబ్బాక ప్రజల ఆత్మగౌరవాన్ని నిలిపే ప్రయత్నం ఏమాత్రం చేయలేదు. చివరికి దుబ్బాక నిధులను మొత్తం రద్దు చేసి సిద్ధిపేటకు తరలించారు" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి చెరకు శ్రీనివాసరెడ్డిని గెలిపించాని ఈ సందర్భంగా ఓటర్లను అభ్యర్థించారు.



## భాజపాను గెలిపిస్తే తెలంగాణ రూపురేఖలు మారిపోతాయి: జేపీ నడ్డా



నిజామాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే తెలంగాణ రూపురేఖలు మారిపోతాయని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయంగా మారిందని.. ఈ పదేళ్లలో ఆయన కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందన్నారు. నిజామాబాద్‌లో నిర్వహించిన సకల జనుల సంకల్ప సభలో నడ్డా మాట్లాడారు. "తెలంగాణ ఉద్యమకారులను కేసీఆర్ మోసం చేశారు. దళిత బంధులో ప్రజాప్రతినిధులు 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను తెలంగాణలో అమలు చేయడం లేదు.

ప్రధాని మోదీ హయాంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ఐదో స్థానానికి చేరింది. గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా 80 కోట్ల మందికి ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నాం. కుటుంబ పాలన నుంచి పలు రాష్ట్రాలకు విముక్తి కల్పించాం. అదే మాదిరిగా కుటుంబ పాలన నుంచి తెలంగాణకూ విముక్తి కల్పిస్తాం" అని నడ్డా వెల్లడించారు.

## కేసీఆర్ ఉద్యోగాలు భర్తీ చేస్తానని.. మాట తప్పాడు




కామారెడ్డి జిల్లా: సీఎం కేసీఆర్ ఉద్యోగాలు భర్తీ చేస్తానని.. మాట తప్పాడని పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం నాడు ఆయన కామారెడ్డి జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..."పదేళ్ల క్రితం సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఒక్కటి కూడా నెరవేర్చలేదు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని సీఎం కేసీఆర్ మాట తప్పడు. దేశంలోనే సచివాలయానికి పోకుండా ఇంటి నుంచి పని చేసే ఏకైక ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ మాత్రమే. ఉద్యోగాలు భర్తీ చేస్తా అని మాట తప్పి, నిరుద్యోగ భృతిని ప్రకటించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తాం" అని నారాయణస్వామి పేర్కొన్నారు.




## అరాచక పాలనపై తీర్పు ఇచ్చే సమయం ఆసన్నమైంది

హనుమకొండ: అరాచక బీఆర్ఎస్ పాలనపై తీర్పు ఇచ్చే సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ మహిళా నేత విజయశాంతి అన్నారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి తరఫున విజయశాంతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడారు. "భూ, మైనింగ్ మాఫియాను కేసీఆర్ ప్రోత్సహించారు. ప్రాజెక్టుల పేరుతో అవినీతి చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం పేరుతో అవినీతికి పాల్పడ్డారు. టీఎస్‌పీఎస్ పేపర్ లీక్‌లో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయే పరిస్థితికి వచ్చింది. ప్రజలు ఏమైపోయినా పర్వాలేదు... కేసీఆర్‌కు డబ్బే ముఖ్యం. లిక్కర్ స్కామ్‌లో ఇతరులను అరెస్టు చేశారు కానీ... కవితను అరెస్టు చేయలేదు. కేసీఆర్ కుటుంబం బరితెగించింది. అందరికీ చుక్కలు చూపించే నా వరంగల్ వాసులను కూడా కేసీఆర్ మోసం చేశారు. వరంగల్ వాసులు కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలి. కేసీఆర్‌ను గద్దె దించాల్సిందే. ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వని స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యేను ఓడించాలి." అని విజయశాంతి పిలుపునిచ్చారు. "సంక్షేమం అంటేనే కాంగ్రెస్. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్. బీజేపీ వాళ్లు సామదాన దండోపాయాలు ఉపయోగించి బీఆర్ఎస్‌ను అధికారంలోకి తేవాలని చూస్తున్నారు. అవినీతి కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా బీజేపీ కాపాడుతోంది. బీఆర్ఎస్-బీజేపీ తోడు దొంగలు." అని విజయశాంతి విమర్శించారు.

## ప్రశ్నించడం తెలంగాణ రక్తంలోనే ఉంది..



నిజామాబాద్: ఎన్నికలు అనగానే ఒక బ్రమ్మ పదార్థం మాకు సంబంధం లేదు అనే ఆలోచన నుండి విద్యార్థులు బయటకు రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురువారం విద్యార్థులు, కొత్త ఓటర్లలతో ఇంటరాక్షన్‌లో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఎన్నికలను ఆషామాశీగా తీసుకోవద్దన్నారు. యువతలో చైతన్యం రావాలన్నారు. స్వేచ్ఛ యుతంగా ఉండటం అనేది ముఖ్యమన్నారు. ఈరోజు ఉన్న స్వేచ్ఛ పోకుండా కాపాడుకోవాలని.. ప్రశ్నించటం తెలంగాణ రక్తంలోనే ఉందని చెప్పుకొచ్చారు. దేశానికి వ్యాపారం పేరుతో వచ్చిన ఆంగ్లేయులు దేశ ప్రజల స్వేచ్ఛను హరించారన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం ఇండియా అని అన్నారు. యువత తమ వాయిస్‌ను వినిపించేందుకు ఉన్న సోషల్ మీడియాను వాడుకోవాలని సూచించారు. తప్పుడు ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే దేశ యువతకు తీరని అన్యాయం జరుగుతాయని.. యువత భవిష్యత్‌పై ప్రభావం ఉంటదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అడవుల శాతం పెరగలేదని.. కానీ తెలంగాణలో తమ ప్రభుత్వ సంకల్పం వల్ల ఇది సాధ్యమైందన్నారు. సైనికులు బార్డర్‌లో నిలబడి దేశం కోసం యుద్ధం చేస్తున్నారని.. యువత ఇక్కడ నిలబడి ఓటు వేయలేరా అని ప్రశ్నించారు. దేశం అభివృద్ధి జరగాలంటే యువత ఓటింగ్‌లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పట్టణాల కంటే గ్రామాల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా ఉంటుందని.. యువతలో చైతన్యం రావాలన్నారు. మన ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉంటే దేశం అంత బలంగా ఉంటుందని తెలిపారు. మహిళలు బాధ్యతాయుతంగా ఆలోచిస్తారని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

## సనాతన ధర్మం.. సోషలిజం రెండూ నడపగలిగేది జనసేన: పవన్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: తాను తెలంగాణలో తిరగక పోయినా జనసేన ఉందంటే మీ అభిమానవేనని, తనది హ్యూమనిజమని, 'నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న' దాశరథీ కృష్ణమా చార్యులు అంటే తనకు స్ఫూర్తి అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ, జనసేన తరఫున ఆయన గురువారం కొత్తగూడెం ప్రకాశం గ్రౌండ్స్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ.. సనాతన ధర్మం, సోషలిజం రెండూ నడప గలిగేది జనసేన అని, బీఆర్ఎస్‌ను ఒక్కమాట అనక పోవడానికి కారణం తాను ఇక్కడ తిరగక పోవడమేనని స్పష్టం చేశారు. దశాబ్దం వేచి చూసానని, ఆంధ్రాలో అరాచకంపై పోరాటానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే తనకు స్ఫూర్తి అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణలో అణగారిన వర్గాలకు జనసేన అండగా ఉంటోందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వ పటిమ నచ్చి ఆయనకు మద్దతుగా ఉన్నానన్నారు. ఎవ్వరు వచ్చినా రాక పోయినా దక్షిణాది నుంచి మోదీకి మద్దతుగా ఉంటానని అన్నారు.

భవిష్యత్తు యువత అని చెప్పిన గద్దర్‌కు జోహార్లని పవన్ అన్నారు. నిధులు నీళ్ళు నియామకాలు నినాదంతో వచ్చిన తెలంగాణలో అనుకున్న స్థాయిలో లేదని విమర్శించారు. తెలంగాణలో




బీసీ నేతను ముఖ్యమంత్రి చేయగలిగేది మోదీ మాత్రమేనని, రెండు తెలుగు రాష్ట్రాల్లో నిత్యం ఎన్నికల వాతావరణం అవాంఛనీయమని అన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ఆయన ఆకాంక్షించారు. సింగరేణిలో ఉద్యోగాలు రావాలన్నా పేపర్ లీక్స్ లేకుండా ఉండాలంటే బిజేపి రావాలన్నారు.

వైఎస్ జల యజ్ఞం దోపిడీ వల్లే తెలంగాణ పోరాటానికికు పునాది పడిందని, కౌలు రైతులను.. రైతులు కాదనడం బాగో లేదన్నారు. ధరణిలో లోపాలున్నాయని, అభివృద్ధి ఆంధ్రాలో జరగక పోతే తెలంగాణ యువత నష్ట పోతుందని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

## బెదిరించే నాయకులకు భయపడకండి.. తరిమికొట్టండి..!

ఖమ్మం: బెదిరించే నాయకులకు భయపడవద్దని.. ఆత్మగౌరవంతో అహంకార నేతలను తరమి కొట్టాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నేడు ఆయన ఖమ్మంలోని శ్రీనివాస నగర్ టీచర్స్ కాలనీలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేరే ప్రాంతాల నుంచి వచ్చి అన్నదమ్ముల్లా కలిసి ఉన్న వారిని ఇబ్బంది పెట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు పూయిస్తాయన్నారు. ప్రశాంతమైన ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల పిలుపునిచ్చారు. 39వ డివిజన్‌లో తుమ్మల మాట్లాడుతూ.. ఖమ్మం కంటే బీహార్ నయం అనేలా పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. గోదావరి ఇసుక.. కొండలు భూ కబ్జాలతో ఖమ్మంలో అరాచకం చెలరేగుతోందన్నారు. పేదల ఇళ్ల స్థలాల పట్టాలు అమ్ముకునే కార్పొరేటర్లు... శ్మశానం కబ్జా చేసే కార్పొరేటర్ల అవినీతి పెచ్చుమీరిపోతోందన్నారు. కమ్మ, కాపు కులాల్లో కుంపట్లు మైనార్టీల్లో వర్గ పోరు పెట్టారన్నారు. అసోసియేషన్‌ల్లో



చీలికలు ఛాంబర్ ఆఫ్ కామర్స్.. గ్రానైట్ అసోసియేషన్‌లో వర్గాలు చేసేలా కుట్రల రాజకీయం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ప్రశాంతమైన ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల పిలుపునిచ్చారు.

## గచ్చిబౌలిలో రూ.5కోట్ల నగదు పట్టివేత



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు జరిపిన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది.

గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని బొటానికల్ పార్కు నుంచి చిరాక్ పబ్లిక్ స్కూల్ వైపు వెళ్తున్న కారును తనికీ చేసిన పోలీసులు రూ. 5 కోట్లు పట్టుకున్నారు. ఈ నగదు ఓ వ్యాపారవేత్తకు సంబంధించినదిగా గుర్తించారు. పట్టుబడిన నగదును ఐటీశాఖకు అప్పగించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com